



జడ్పీలో ఉద్రిక్తత

సర్వ సభ్య సమావేశంలో ముఖ్యమంత్రిని ఉద్దేశించి పద్మనాభం జడ్పీటీసీ సభ్యుడు గిరిబాబు అనుచిత వ్యాఖ్యలు

- అభ్యంతరం వ్యక్తం చేసిన ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు
- 'భూముల ఆక్రమణలకు సంబంధించి పత్రికల్లో వచ్చిన కథనాలపై మాట్లాడదామా...'అంటూ సవాల్
- శాసనసభ్యుని వైపు దూసుకువచ్చిన వైసీపీ సభ్యులు
- కొద్దిసేపు వాగ్వాదం
- సర్దిచెప్పిన బండారు, ఇతర సభ్యులు



వైసీపీ జడ్పీటీసీ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు బండారు, కేఎస్ఎన్ఎస్ రాజు

విశాఖపట్నం, జూలై 27 (ఆంధ్రజ్యోతి):

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో శనివారం కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. ఎన్నికల సమయంలో ప్రకటించిన 'సూపర్ సిక్స్' పథకాలపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, వాటి అమలుకు భయపడుతున్నారని వైసీపీకి చెందిన పద్మనాభం జడ్పీటీసీ సభ్యుడు సుంకరి గిరిబాబు చేసిన వ్యాఖ్యలపై ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా సుందరపు విజయకుమార్‌తో వైసీపీకి చెందిన జడ్పీటీసీ సభ్యులు వాగ్వాదానికి దిగడంతో ఒక్కసారిగా సభలో గందరగోళం ఏర్పడింది.

చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జిల్లా పరిషత్ సమావేశం శనివారం ఉదయం పది గంటలకు ప్రారంభమైంది. వ్యవసాయ శాఖపై చర్చలో జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు వీరవెంకట సత్యనారాయణకుమార్ లేచి అచ్యుతాపురం మండలం దోసూరు జడ్పీ ఉన్నత పాఠశాల స్థలం ఆక్రమణకు గురవుతుందని, కబ్జాదారులు ఎమ్మెల్యే పేరు చెబుతున్నారని అనడంతో చర్చ పక్కదారి పట్టిస్తున్నారంటూ జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ దశలో ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ జోక్యం చేసుకుని పాఠశాల భూమిని గత పాలకుల నుంచి తమ పార్టీ కార్యకర్తలు ప్రాణాలకు తెగించి పోరాడి కాపాడుకున్నారని, కబ్జాలు ఎవరి హయాంలో ఎక్కువ జరిగాయో అందరికీ తెలుసునని వ్యాఖ్యానించారు. దోసూరు ఒక్కటే కాకుండా ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములు కాపాడాలని పేర్కొనడంతో బుచ్చెయ్యపేట జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు స్పందిస్తూ అంశాల వారీగా చర్చించుకోవాలే తప్ప రాజకీయాల ప్రస్తావన వద్దని పేర్కొనడంతో ఆయనకు పద్మనాభం జడ్పీటీసీ సభ్యుడు సుంకరి గిరిబాబు మద్దతు పలుకుతూ అప్రస్తుత విషయాలు ఇక్కడ వద్దన్నారు. దీనికి సుందరపు విజయకుమార్ మాట్లాడుతూ చర్చ పక్కదారిపడుతున్నా సభకు ఎందుకు నియంత్రించడం లేదంటూ చైర్‌పర్సన్‌ను నిలదీశారు. ఆ తరువాత తిరిగి వ్యవసాయ శాఖపై చర్చ ప్రారంభం కావడంతో పద్మనాభం జడ్పీటీసీ సభ్యుడు గిరిబాబు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా ఇంతవరకూ రైతులకు రైతుభరోసా సొమ్ము జమ చేయలేదన్నారు. సూపర్‌సిక్స్ పథకాల అమలుకు ముఖ్యమంత్రి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భయపడుతున్నారని వ్యాఖ్యానించడంతో ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేస్తూ గత ఐదేళ్లలో రాష్ట్రాన్ని 9.7 లక్షల కోట్ల అప్పుల్లోకి గత పాలకులు తీసుకువెళ్లారని ఆరోపించారు. ఆర్థికంగా దివాలా తీయించారన్నారు. అందుకు ప్రతిగా గిరిబాబు మరోసారి మాట్లాడేందుకు యత్నించడంతో విజయకుమార్ జోక్యం చేసుకుని సీఎంపై అనుచిత వ్యాఖ్యలు సరికాదని...'పద్మనాభంలో మీ భూఆక్రమణలపై పత్రికల్లో వచ్చిన కథనాలపై మాట్లాడదామా?' అని ప్రశ్నించారు. దీంతో వైసీపీ జడ్పీటీసీ సభ్యులు ఒక్కసారిగా లేచి విజయకుమార్‌తో వాగ్వాదానికి దిగడంతో సభలో దుమారం రేగి స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. వైసీపీ సభ్యులు మూకుమ్మడిగా సుందరపు విజయకుమార్ వైపు రావడంతో జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, మిగిలిన సభ్యులు ఇరువర్గాలకు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. గొడవకు దిగిన సభ్యులు బయటకు వెళ్లాలని సుభద్ర హెచ్చరించారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, పరవాడ జడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు లేచి సభ్యులంతా సంయమనం పాటించాలని కోరడంతో సభలో వివాదం ముగిసింది. తరువాత బండారు మాట్లాడుతూ జిల్లాలో ప్రధాన సమస్యలపై చర్చించేటప్పుడు ఇతర అంశాల ప్రస్తావన వద్దని సూచించగా, చోడవరం ఎమ్మెల్యే

... మిగతా 7వ పేజీలో



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర. చిత్రంలో విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల కలెక్టర్లు

వరి విత్తనాలు మొలకెత్తడం లేదు

వర్షాలతో నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వండి

- గోవాడ షుగర్స్‌లో ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటుతో రైతులకు మేలు
- ఏజెన్సీలో దోమతెరలు వెంటనే సరఫరా చేయండి
- కొయ్యూరులో కిడ్నీ రోగులకు డయాలసిస్ సదుపాయం లేదు
- కేజీహెచ్‌లో లంచాలను అరికట్టండి
- జడ్పీ సమావేశంలో పలు అంశాలను ప్రస్తావించిన సభ్యులు

విశాఖపట్నం, జూలై 27 (ఆంధ్రజ్యోతి):

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులకు విక్రయించిన వరి విత్తనాలు చాలా చోట్ల మొలకెత్తడంలేదని పలువురు జడ్పీటీసీ సభ్యులు ఆందోళన వ్యక్తంచేశారు. మొలకెత్తని విత్తనాలు ఎందుకు సరఫరా చేస్తున్నారని ప్రశ్నిస్తూ, వ్యవసాయశాఖ బాధ్యతగా ఉండాలని కోరారు. శనివారం చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జరిగిన జడ్పీ సర్వసభ్య సమావేశంలో వ్యవసాయశాఖపై చర్చ ప్రారంభించినప్పుడు కొయ్యూరు, అనంతగిరి, పెదబయలు జడ్పీటీసీ సభ్యులు వారా నూకరాజు, గంగరాజు, బొంజిబాబులు మాట్లాడుతూ విత్తనాలు మొలకెత్తకపోవడంతో రైతులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఏజెన్సీలో రాగులు, రాజ్‌మా విత్తనాలు వెంటనే సరఫరా చేయాలని జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర కోరారు. వైసీపీ ఎమ్మెల్సీ వరుదు కల్యాణి జోక్యంచేసుకుని నాణ్యమైన విత్తనాలు ఎందుకు సరఫరా చేయడంలేదని ప్రశ్నించగా, అనకాపల్లి జిల్లా వ్యవసాయశాఖాధికారి మోహనరావు బదులిస్తూ నాణ్యత లేని 40 బస్తాల విత్తనాలను వెనక్కి పంపామన్నారు. రైతు భరోసా సొమ్ము జమ చేయడంపై ఇంకా మార్గదర్శకాలు రాలేదని పేర్కొన్నారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ గతంలో ఒక సీజన్‌లో సుమారు ఐదు లక్షల మెట్రిక్ టన్నుల పంచదార ఉత్పత్తిచేసే గోవాడ షుగర్స్ ఇప్పుడు రెండులక్షల కంటే తక్కువ ఉత్పత్తికి పడిపోయిందని ఆందోళన వ్యక్తంచేశారు. ఏటికొప్పాక, తాండవ షుగర్స్ కర్మాగారాలు ఇప్పటికే మూత పడ్డాయన్నారు. గోవాడ షుగర్స్ కర్మాగారంలో పీపీపీ విధానంలో ఇథనాల్ యూనిట్‌ను ఏర్పాటుచేస్తే రైతులకు, కార్మికులకు మేలు జరుగుతుందని పేర్కొంటూ ఇందుకు సభ ఏకగ్రీవంగా తీర్మానించాలని ప్రతిపాదించారు. చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు మాట్లాడుతూ గంధవరంలో ఏర్పాటు చేయతలపెట్టిన విత్తన శుద్ధి యూనిట్ నిలిచిపోయిందని పేర్కొంటూ త్వరితగతిని పూర్తిచేయాలని కోరగా, అనకాపల్లి కలెక్టర్ సునీత విజయకృష్ణన్ సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ప్రభుత్వం తక్షణమే సాయం ప్రకటించాలి

ఇటీవల కురిసిన వర్షాలకు ఏజెన్సీలో పంటలు దెబ్బతిన్నాయని జడ్పీ చైర్‌పర్సన్ సుభద్రఆందోళన వ్యక్తం చేస్తూ ప్రభుత్వం తక్షణమే సాయం ప్రకటించాలని కోరారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ ఈ-క్రాప్ నమోదు పక్కాగా చేపట్టాలని, లేకపోతే రైతు పండించుకునే పంట దళారుల పాలవుతుందని పేర్కొనగా, అధికారులు స్పందిస్తూ ఖరీఫ్ పంటల సాగు సమయంలోనే ఈ-క్రాప్ నమోదు చేస్తున్నామన్నారు. దేవరాపల్లి జడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం మాట్లాడుతూ చెరకు రైతులకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరారు. ఏజెన్సీలో పైనాపిల్ పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని చింతపల్లి జడ్పీటీసీ సభ్యుడు పోతుల బాలయ్య కోరారు. కొయ్యూరు జడ్పీటీసీ సభ్యుడు నూకరాజు మాట్లాడుతూ కోతుల దాడుల నుంచి రైతుల పంటలకు రక్షణ కల్పించాలని కోరగా, అల్లూరి సీతారామరాజు కలెక్టర్ దినేశ్‌కుమార్ బదులిస్తూ

... మిగతా 7వ పేజీలో

బదిలీ రద్దాయె, సొమ్ములు పోయె!

వైసీపీ హయాంలో టీచర్ల బదిలీల కోసం డబ్బులు వసూలు చేసిన పెద్దలు

- రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ కలెక్షన్
- ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి రూ.2 కోట్లు వరకూ వసూళ్లు
- ఎన్నికల ముందు హడావిడిగా ఉత్తర్వులు
- ఇప్పుడు వాటిని రద్దు చేయడంతో టీచర్ల గగ్గోలు
- అజ్ఞాతంలోకి 'మధ్యవర్తి'
- సొమ్ములు తిరిగి ఇవ్వాలంటూ టీచర్లు పట్టు



అనకాపల్లి డీఈవో కార్యాలయం

విశాఖపట్నం, జూలై 27 (ఆంధ్రజ్యోతి):

వైసీపీ పాలనలో పాఠశాల విద్యా శాఖ అడ్డగోలుగా చేపట్టిన ఉపాధ్యాయ బదిలీలను కొత్త ప్రభుత్వం రద్దు చేసింది. దీంతో బదిలీల కోసం ఉపాధ్యాయుల నుంచి డబ్బులు తీసుకున్న వ్యక్తులు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. సెల్‌ఫోన్‌లు కూడా స్విచ్ ఆఫ్ చేసేయడంతో టీచర్లు లబోదిబోమంటున్నారు.

ఎన్నికలకు ఆరు నెలల ముందు మైదాన, ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేస్తున్న కొంతమంది ఉపాధ్యాయులు నగరం, చుట్టుపక్కల ప్రాంతాల్లో పోస్టింగ్ కోసం ఓ మంత్రిని సంప్రతించారు. ఈ వ్యవహారంలో సదరు మంత్రి వద్ద పీఏగా పనిచేస్తున్న వ్యక్తి మధ్యవర్తిగా ఉండి కథ నడిపారు. ఒక్కొక్కరి వద్ద రూ.రెండు లక్షల నుంచి రూ.ఐదు లక్షల వరకూ వసూలు చేశారు. అలా డబ్బులు ఇచ్చిన వారికి పోస్టింగ్ ఇవ్వాలని కోరుతూ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు కొద్దిరోజుల ముందు జిల్లా విద్యా శాఖాధికారిణికి విద్యా శాఖ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ఫిబ్రవరి, మార్చి తొలి వారంలో బదిలీ అయిన టీచర్లు జూన్ 12వ తేదీ తరువాత విధుల్లో చేరాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈలోగా నోటిఫికేషన్ విడుదల కావడం, ప్రభుత్వం మారిపోవడంతో ఆ ఉత్తర్వులు అమలుకు నోచుకోలేదు.

ఇదిలావుండగా గత ఏడాది నుంచి ఈ ఏడాది మార్చి తొలి వారం వరకు మూడు రకాలుగా బదిలీలు చేపట్టారు. మొదటిది...ముఖ్యమంత్రి కార్యాలయం సిఫారసు మేరకు జరిగిన బదిలీలకు ఆర్థికశాఖ అనుమతి ఇచ్చింది. రెండోది ముఖ్యమంత్రి కార్యాలయం అనుమతి మేరకు జరిగిన బదిలీలకు ఆర్థిక శాఖ అనుమతి లేకపోవడం. మూడోది..సీఎం కార్యాలయం, ఆర్థిక శాఖ నుంచి అనుమతి లేకుండా చేసిన బదిలీలు. ఈ మూడింటిలో తొలి రెండు రకాల బదిలీల జోలికి ప్రస్తుత ప్రభుత్వం వెళ్లకుండా సీఎం పేషీ, ఆర్థిక శాఖ అనుమతి లేకుండా జరిగిన బదిలీలను మాత్రం రద్దు చేసింది. ఈ బదిలీల్లో విజయనగరానికి చెందిన వ్యక్తే కీలక పాత్ర పోషించారు. మంత్రి వద్దకు వెళ్లిన టీచర్లతో సదరు పీఏ మాట్లాడి డబ్బులు వసూలు చేసేవారు. నెల్లిమర్ల మండలానికి చెందిన ప్రభుత్వ పాఠశాల టీచరు ఒకరు బ్రోకరుగా ఉన్నారు. కొందరు మంత్రి పీఏకు, మరికొందరు టీచరుకు సొమ్ములు ఇచ్చినట్టు ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయి. విశాఖ జిల్లా నుంచి సుమారు రెండు కోట్ల రూపాయల వరకు వసూలు చేశారని అంటున్నారు.

ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఈ ఏడాది ఫిబ్రవరి తరువాత చేసిన బదిలీలను ప్రభుత్వం రద్దు చేయడంలో సొమ్ములు ఇచ్చిన టీచర్లంతా సదరు పీఏను కలిసేందుకు విజయనగరం వెళ్లగా...అందుబాటులో లేకుండా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఇంటికి వెళ్లి వాకబు చేస్తే క్యాంపు వెళ్లారని చెబుతున్నారు. ఎప్పుడు వస్తారని అడిగితే సమయం పడుతుందని తప్పించుకుంటున్నారని పలువురు వాపోయారు. చివరకు ఫోన్ కట్టేయడంతో లబోదిబోమంటున్నారు. మరికొందరు నెల్లిమర్ల మండలంలో ప్రభుత్వ టీచరును కలిసి తాము ఇచ్చిన సొమ్ములు సంగతి ఏమిటని ప్రశ్నిస్తే తనకు సంబంధం లేదని చెబుతున్నారు. వారం నుంచి ఆయన కూడా సెల్‌ఫోన్ ఆపేసి స్కూలుకు రాకుండా తప్పించుకుంటున్నారని సొమ్ములు ఇచ్చిన టీచర్లు వాపోతున్నారు. ఇటువంటి వ్యవహారాల్లో పని జరిగితే అదృష్టమే తప్ప ఇచ్చిన సొమ్ములకు గ్యారంటీ ఉండదని ఉపాధ్యాయ సంఘాల నేతలు వ్యాఖ్యానిస్తున్నారు.

రూ.కోట్ల విలువైన ఆలయ భూముల కబ్జాకు యత్నం

హెచ్చరిక బోర్డు తొలగింపు

- అడ్డుకున్న దేవాదాయ శాఖాధికారులు
- ఆక్రమణదారులపై పోలీసులకు ఫిర్యాదు



ఆక్రమణదారులు తొలగించిన హెచ్చరిక బోర్డును మళ్లీ ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

అనకాపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి):

అనకాపల్లి నడిబొడ్డున పూల్‌బాగ్ పరిసరాల్లో రూ.కోట్లు విలువ చేసే దేవాదాయ శాఖకు చెందిన భూముల ఆక్రమణకు అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే అనుచరులు కొందరు ప్రయత్నించారు. శనివారం దేవదాయశాఖ గతంలో ఏర్పాటు చేసిన బోర్డును తొలగించి భూ కబ్జాకు యత్నించారు. అధికారులకు ఈ విషయం తెలిసి అక్కడికి వచ్చి ఆక్రమణదారులను అడ్డుకున్నారు.

అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు సమీపంలోని పూల్‌బాగ్ ప్రాంతంలో విశాఖపట్నం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం (అంబికాబాగ్)కు చెందిన సర్వే నంబరు 66 (టీడీ నంబరు 3274)లో సుమారు 29.71 ఎకరాల భూమి ఉంది. ఈ భూమి దేవదాయ శాఖ ఆధీనంలో ఉన్నప్పటికీ ఆ భూములు తమవిగా చెప్పుకొని అనకాపల్లికి చెందిన కొణతాల రజని, బొడ్డేడ శ్రీనివాసరావులు మరికొందరుతో కలిసి గత వైసీపీ ప్రభుత్వం హయాంలో కూడా తమ ఆధీనంలోకి తీసుకొనేందుకు ప్రయత్నించారు. అప్పట్లో తీవ్రంగా ప్రతిఘటించిన దేవదాయ శాఖాధికారులు కోర్టును ఆశ్రయించారు. 2022 సెప్టెంబరులో సీసీఎల్ఏ కోర్టు, ఆర్డీవో కోర్టులో పూల్‌బాగ్‌లోని ఆ భూములు విశాఖపట్నం శ్రీసీతారామచంద్రస్వామికి చెందినవిగా తీర్పు వచ్చింది. అప్పట్లోనే దేవదాయ శాఖ అధికారులు స్థలం వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. నాటి నుంచి స్థలం వద్ద కోర్టు సూచనల మేరకు ప్రైవేటు రక్షణ సిబ్బందిని కూడా ఏర్పాటు చేశారు.

మళ్లీ అదే బరితెగింపు

అధికార పార్టీ అనుచరులుగా చెప్పుకొంటున్న కొందరు శనివారం ఉదయం 11 గంటల సమయంలో ఎక్స్‌కవేటర్‌తో వచ్చి దేవదాయ శాఖ ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును తొలగించారు. సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకొనే ప్రయత్నం చేసినా తమకు కోర్టు స్టేటస్కో ఉత్తర్వులు ఇచ్చిందని బుకాయించారు. విషయం తెలిసి దేవదాయశాఖ అధికారులు అక్కడికి వచ్చి స్టేటస్కో ఉత్తర్వులు చూపించాలని ఆక్రమణదారులను నిలదీశారు. ఇంతలో మీడియా ప్రతినిధులు అక్కడికి రావడంతో ఆక్రమణదారులు జారుకున్నారు. ఈ సంఘటనపై దేవదాయ శాఖ ఏఈవో రాంబాబు, ఏఈ సూర్యనారాయణలు అనకాపల్లి డీఎస్పీ అప్పలరాజుకు ఫిర్యాదు చేశారు. దీనిపై డీఎస్పీ అప్పలరాజు మాట్లాడుతూ భూ వివాదం కోర్టు పరిధిలో ఉన్నందున దేవదాయ శాఖ ఉద్యోగుల ఫిర్యాదును పరిశీలించి చర్యలు చేపడతామన్నారు. ఈ భూములను సీపీఎం నేత లోకనాథం, జిల్లా కమిటీ సభ్యులు శంకరరావు, శ్రీరామ్, శ్రీనివాసరావు పరిశీలించారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

పరిహారం ప్లాట్లు గంగపాలు

జగనన్న కాలనీకి భూములిచ్చిన రైతులు గగ్గోలు

- ముంపు ప్రాంతంలో స్థలాలిచ్చి గత వైసీపీ ప్రభుత్వం మోసం చేసిందని ఆవేదన

సబ్బవరం, జూలై 27: మండలంలోని పైడివాడఅగ్రహారం గ్రామంలో జగనన్న కాలనీకి భూములు ఇచ్చిన రైతులకు పరిహారం కింద గత వైసీపీ ప్రభుత్వం అభివృద్ధి చేసిన ప్లాట్లు ముంపునకు గురికావడంతో రైతులు లబోదిబోమంటున్నారు. దీనిపై మూడేళ్లుగా అనేక సార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని రైతులు వాపోతున్నారు.

పైడివాడ, పైడివాడఅగ్రహారం, ఎరుకునాయుడుపాలెం గ్రామాల పరిధిలో గత వైసీపీ ప్రభుత్వం జగనన్న కాలనీ కోసం రైతుల సాగులో ఉన్న డీ పట్టా, ప్రభుత్వ భూములు 320 ఎకరాలను సమీకరించింది. పరిహారం కింద రైతులకు అభివృద్ధి చేసిన ప్లాట్లు ఇస్తామని చెప్పింది. అయితే పరిహారం ప్లాట్లను గెడ్డలు, వాగులు ప్రవహించే మార్గంలో అభివృద్ధి చేస్తుండడంతో అప్పట్లో రైతులు వ్యతిరేకించారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఇటీవల పూర్తిగా ముంపు ప్రాంతంలో ప్లాట్లు అభివృద్ధి చేశారు. ముందుగా రోడ్లు అభివృద్ధి కోసం గెడ్డ ప్రవాహానికి అడ్డుగా గ్రావెల్ వేశారు. తాజాగా కురిసిన వర్షాలకు ప్లాట్లన్నీ వరద నీటిలో మునిగిపోయాయి. ముంపు ప్రాంతంలో తమకు పరిహారం ప్లాట్లు వద్దని మొత్తుకుంటున్నా వీఎంఆర్‌డీఏ అధికారులు వినకుండా అక్కడే ఇచ్చారని రైతులు అక్కిరెడ్డి దుర్గినాయుడు, బొబ్బరి కన్నారావు, గొంతిన పైడిరాజు తదితరులు వాపోతు న్నారు. వరదలో కొట్టుకుపోవడం వల్ల తమ ప్లాట్లు ఎవరూ కొనుగోలు చేయరని, దీని వల్ల తమకు నష్టం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి తమకు వేరే చోట పరిహారం ప్లాట్లు అభివృద్ధి చేసి ఇవ్వాలని కోరుతున్నారు.



పైడివాడఅగ్రహారంలో నీట మునిగిన రైతులకు ఇచ్చిన పరిహారం ప్లాట్లు

గత వైసీపీ ప్రభుత్వం మోసం చేసింది



గత వైసీపీ ప్రభుత్వం రైతులను పూర్తి గా మోసం చేసింది. జగనన్న కాలనీ నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు అన్ని వసతులతో అభివృద్ధి చేసిన పరిహారం ప్లాట్లు ఇస్తామని చెప్పింది. ముంపు ప్రాంతంలో, గెడ్డలు ప్రవహించే మార్గంలో స్థలాలు ఇచ్చి చేతులు దులుపుకుంది. కొండల నుంచి వచ్చే వరద నీరు మళ్లిస్తామని అధికారులు చెప్పారు. అది కూడా చేయలేదు. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళతాం.

- అక్కిరెడ్డి దుర్గినాయుడు,
రైతు, పైడివాడఅగ్రహారం

క్రైం... crime news

ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతి



కె.కోటపాడు, జూలై 27: ట్రాక్టర్ బోల్తా పడడంతో డ్రైవర్ అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కింతాడ గ్రామానికి చెందిన బండారు శివ (35) శనివారం పొలంలో వరి దమ్ము దున్నుతుండగా ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ బోల్తా పడింది. దీంతో శివ ట్రాక్టర్ కింద పడి మృతి చెందాడు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కె.కోటపాడు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చోడవరం తరలించారు. మృతుడు శివకు భార్య చంద్రకళ, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. శివ మృతితో కింతాడలో విషాదఛాయలు అలుముకున్నాయి.

యువతిపై అత్యాచారం

▸ నిందితుడితో పాటు కిడ్నాప్‌నకు సహకరించిన మరో ఐదుగురి అరెస్టు

అనకాపల్లి టౌన్, జూలై 27: పట్టణానికి చెందిన ఒక యువతిని కిడ్నాప్ చేసి అత్యాచారానికి పాల్పడిన యువకుడిని, అతడికి సహకరించిన మరో ఐదుగురిని శనివారం అరెస్టు చేసినట్టు సీఐ జి.శంకరరావు తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన అందించిన వివరాలిలా ఉన్నాయి. బాధిత యువతి (19)కి శారదా నగర్‌కు చెందిన పూడి తేజసాయికుమార్ (25)తో కొంతకాలంగా పరిచయం ఉంది. ఆమె, ఆమె స్నేహితురాలు ఎస్.రాయవరం మండలానికి చెందిన వివేకానందతో సన్నిహితంగా ఉంటున్నట్టు తేజసాయికుమార్ అనుమానించాడు. బాధితురాలు, ఆమె స్నేహితురాలు, వివేకానంద కలిసి గురువారం ద్విచక్ర వాహనంపై సింహాచలం బయలుదేరారు. ఈ విషయం తెలుసుకున్న తేజసాయికుమార్ తన స్నేహితులు రాజనాల అభిలాష్ (అభి), బుద్ద శంకర్, నక్కిన పవన్ శ్రీరామ్, మాటూరు హరీష్, వారణాసి రామ్ శాంతారామ్‌లతో కలిసి పట్టణంలోని పాత గోపాలకృష్ణ థియేటర్ వద్ద అడ్డుకుని వారిని కిడ్నాప్ చేసి బొజ్జన్నకొండ వైపు తీసుకువెళ్లి భయపెట్టారు. దీంతో బాధితురాలు ఏలేరు కాలువలో దూకేయడంతో అభి అనే యువకుడు కాపాడాడు. అక్కడి నుంచి వారిని స్థానిక ఉడ్‌పేటలోని హ్యాపీ హౌస్‌కు తీసుకువచ్చారు. బాధితురాలు వాష్ రూమ్‌కు వెళ్లి దుస్తులు ఆరబెట్టుకుంటుండగా అదే సమయంలో తేజసాయికుమార్ వెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో ఆమె భయపడి స్నేహితురాలి ఇంటికి వెళ్లింది. ఇదిలావుండగా తన కుమార్తె కనిపించడం లేదని ఆమె తండ్రి శుక్రవారం ఉదయం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె స్నేహితురాలి ఇంట్లో ఉందని గుర్తించి, అక్కడకు వెళ్లి జరిగిన విషయం తెలుసుకుని శుక్రవారం రాత్రి తిరిగి పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, తేజసాయికుమార్ సహా ఆరుగురినీ అరెస్టు చేసినట్టు సీఐ తెలిపారు.

వచ్చే నెల నుంచి క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రోగ్రామ్

▸ వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు



సదస్సులో మాట్లాడుతున్న కృష్ణబాబు

విశాఖపట్నం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ వ్యాధిని సకాలంలో గుర్తించి మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించామని వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు పేర్కొన్నారు. నేషనల్ క్యాన్సర్ గ్రిడ్ రెండో వార్షిక సదస్సును శనివారం ఆంధ్ర మెడికల్ కళాశాలలో నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ క్యాన్సర్‌ను సకాలంలో గుర్తించి, వైద్యం అందించడం కీలకమన్నారు. ఆగస్టు నుంచి రాష్ట్రంలో క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రోగ్రామ్‌ను అమలు చేస్తున్నామని, ఇంటింటికీ వెళ్లి ఓరల్, సర్వైకల్, రొమ్ము క్యాన్సర్‌కు సంబంధించి స్క్రీనింగ్ నిర్వహించనున్నారన్నారు. తద్వారా సకాలంలో వ్యాధితో బాధపడుతున్న వారిని గుర్తించి వైద్య సేవలు అందించేందుకు వీలవుతుందన్నారు. ఇందుకోసం రాష్ట్రంలోని 16 మెడికల్ కాలేజీల్లో అంకాలజీ విభాగాలను ఏర్పాటుచేశామని, వాటిని మరింత బలోపేతం చేస్తున్నామన్నారు.

నేడు పెద్దేరు రాచకట్టు కాలువ నీరు విడుదల

మాడుగుల రూరల్, జూలై 27: మండలంలోని పెద్దేరు జలాశయం రాచకట్టు కాలువ నీటిని ఆదివారం ఉదయం పది గంటలకు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి విడిచిపెడతారని ఆయకట్టు రైతులు అద్దిపల్లి జగ్గారావు, ఉండూరు దేముడు తెలిపారు. ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్‌లో మాడుగుల మండలానికి రాచకట్టు కాలువ నీటిని విడిచిపెడతారని, ఈ ఏడాది కూడా వరి, చెరకు పంటలు సాగు చేసేందుకు నీరు వదులుతారన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, రైతులు పాల్గొనాలని కోరారు.

జడ్పీలో ఉద్రిక్తత

... 5వ పేజీ తరువాయి

కేఎస్ఎన్ఎస్ రాజు మాట్లాడుతూ సభ్యులంతా సమన్వయంతో మెలిగి సమస్యలపై చర్చించాలని కోరారు. పాఠశాలల్లో గంజాయి వినియోగంపై ప్రత్యేక నిఘా పెట్టాలని అధికారులను జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర ఆదేశించారు. జిల్లాలో గంజాయి నిర్మూలనకు తొలుత ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు చేసిన సూచనపై ఆమె స్పందించారు. కాగా ప్రజలకు ప్రభుత్వం ఇసుక ఉచితంగా ఇస్తోందని, చోడవరంలో మాత్రం ఎడ్లబళ్లపై ఇంటి నిర్మాణాలకు తీసుకువస్తున్న వ్యక్తులపై దాడులు చేయడం సరికాదని చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ఆగ్రహం వ్యక్తంచేశారు. పంటల బీమా కోసం రైతుల నుంచి ప్రీమియం వసూలు చేస్తున్నా పంట నష్టపోయినప్పుడు రైతులకు బీమా రాలేదని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆవేదన వ్యక్తంచేస్తూ ఫసల్‌బీమాను వినియోగించుకునేలా చైతన్యం తీసుకురావాలన్నారు.

స్థాయీ సంఘాల సభ్యులుగా ఎంపీలు, ఎమ్మెల్యేలు

శనివారం ఉదయం సభ ప్రారంభం కాగానే ఇటీవల మృతిచెందిన రావికమతం జడ్పీటీసీ సభ్యురాలు తలారి రమణమ్మ ఆత్మశాంతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం జడ్పీ స్థాయీ సంఘాల్లో కొత్తగా ఎన్నికైన ఎంపీలు, ఎమ్మెల్యేలకు స్థానం కల్పించినట్టు జడ్పీ సీఈవో ఎం.పోలినాయుడు ప్రకటించారు. ప్రణాళిక, ఆర్థిక స్థాయీ సంఘం సభ్యులుగా అనకాపల్లి, ఎలమంచిలి, చోడవరం, పాయకరావుపేట, నర్సీపట్నం ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, సుందరపు విజయకుమార్, కేఎస్ఎన్ఎస్ రాజు, వంగలపూడి అనిత, చింతకాయల అయ్యన్నపాత్రుడు, గ్రామీణాభివృద్ధి స్థాయీ సంఘ సభ్యుడిగా పాడేరు ఎమ్మెల్యే ఎం.విశ్వేశ్వరరాజు నియమితులయ్యారు. వ్యవసాయ స్థాయీ సంఘ సభ్యునిగా విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, విద్య, వైద్య స్థాయీ కమిటీ సభ్యుడిగా అరకులోయ ఎంపీ తనూజారాణి, స్త్రీ సంక్షేమ, రక్షణ స్థాయీ సంఘ సభ్యుడిగా అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, వర్క్స్ స్థాయీ సంఘ సభ్యులుగా భీమిలి, పెందుర్తి, అరకులోయ ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పంచకర్ల రమేష్‌బాబు, రేగం మత్స్యలింగం నియమితులయ్యారు. సమావేశంలో ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, పంచకర్ల రమేశ్‌బాబు, మత్స్యలింగం, ఎమ్మెల్సీలు వేపాడ చిరంజీవిరావు, వరుదు కల్యాణి, జడ్పీటీసీ సభ్యులు, విశాఖ కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ పాల్గొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	85.00
లైవ్ ధర	105.00
విత్ స్కిన్	180.00
స్కిన్ లెస్	190.00


కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	485
విజయనగరం	489
శ్రీకాకుళం	489

హెపటైటిస్ ముప్పు

లివర్ సంబంధిత సమస్యల్లో 40 శాతం హెపటైటిస్ కేసులే..

▸ కేజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగానికి వచ్చే కేసుల్లో 30 శాతం ఇవే
▸ తగిన జాగ్రత్తలు తీసుకుంటే లివర్ సిర్రోసిస్‌కు వెళ్లకుండా అడ్డుకట్ట
▸ వైరల్ హెపటైటిస్ ఏ, బీ వ్యాక్సినేషన్‌తో సమస్యలకు చెక్..
▸ బీచ్ రోడ్డులో నేడు లివర్ వాక్

నేడు ప్రపంచ హెపటైటిస్ దినం





కేజీహెచ్‌లో హెపటైటిస్ వ్యాక్సిన్ ఇస్తున్న చిత్రం

విశాఖపట్నం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కాలేయానికి హెపటైటిస్ వైరస్ ముప్పుగా పరిణమిస్తోంది. ముఖ్యంగా హెపటైటిస్ బీ, సీ వైరస్ కారణంగా కాలేయ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. లివర్ సంబంధిత సమస్యలో 40 శాతం హెపటైటిస్ కేసులో ఉన్నాయి. ఈ వైరస్ పట్ల ప్రజల్లో పెరిగిన అవగాహన, వ్యాక్సినేషన్ వంటి కారణాలు వల్ల వైరస్ బారినపడుతున్న వారి సంఖ్య కొంతమేర తగ్గుముఖం పట్టింది. అయినప్పటికీ ఈ వైరస్ పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. వైరస్ బారినపడిన విషయాన్ని చివరి వరకు గుర్తించలేకపోవడం వంటి కారణాలు లివర్ సిర్రోసిస్‌కు దారితీసి మృత్యువాత చెందేలా చేస్తున్నాయి. కాబట్టి ప్రజల్లో అవగాహన కలిగించాలనే ఉద్దేశంతో ఏటా జూలై 28న ప్రపంచ హెపటైటిస్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. 'చర్యలకు ఇదే సరైన సమయం' అనే థీమ్‌తో ఈ ఏడాది హెపటైటిస్ డే నిర్వహిస్తున్న నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం...

గత పదేళ్లుగా..

హెపటైటిస్-బీని 20 ఏళ్ల కిందట కనిపెట్టారు. అప్పటినుంచి ఏటా అదే రోజు హెపటైటిస్ డేగా ప్రపంచమంతాటా నిర్వహిస్తున్నారు. హెపటైటిస్‌ను ఏ, బీ, సీ, డీ, ఈ అని ఐదు రకాలుగా పేర్కొంటారు. హెపటైటిస్ అంటే లివర్‌కు కలిగే వైరల్ ఇన్ఫెక్షన్. వీటిలో ఏ, డీ, ఈ రకాలు ప్రమాదకరమైనవి కావు. వ్యాధితో బాధపడే వ్యక్తి మూత్రవిసర్జన చేసినప్పుడు, మల విసర్జన చేసినప్పుడు నీటిలో కలుషితమైపోతాయి. ఈ నీటిని తాగిన వారికి వైరస్ సోకి పచ్చకామెర్లుగా కనిపిస్తుంది. బీ, సీ మాత్రం అత్యంత ప్రమాదకరమైనవి. వీటి బారినపడిన వారికి అంత వేగంగా నయమయ్యేందుకు అవకాశం లేదని వైద్య నిపుణులు చెబుతున్నారు. నిర్లక్ష్యం చేస్తే లివర్ సిర్రోసిస్ స్టేజ్‌కు చేరుకుని ప్రాణాపాయం సంభవించే అవకాశముంది. హెపటైటిస్ బీ, సీ కలుషిత రక్తం, సిరంజ్, సూదులు వినియోగించడం, అసురక్షితమైన లైంగిక సంపర్కం, డ్రగ్స్ వినియోగం, తల్లి నుంచి బిడ్డకు ఇది సంక్రమిస్తుంది.

లివర్ సిర్రోసిస్, కేన్సర్లకు..

హెపటైటిస్ బీ, సీ వైరస్ వల్ల లివర్ సిర్రోసిస్, కేన్సర్లు బారినపడే ప్రమాదముందని వైద్య నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా హెపటైటిస్ బీ, సి వైరస్ బారినపడిన వారిలో పచ్చకామెర్లు, జ్వరం, వికారం, వాంతులు, జ్వరం తగ్గడం, రావడం లక్షణాలు కనిపిస్తాయి. హెపటైటిస్-బీ వైరస్ వల్ల ఈ సమస్యలతో బాధపడిన వారిలో పదేళ్ల తర్వాత లివర్ సిర్రోసిస్‌కు దారితీసే ప్రమాదముంది. హెపటైటిస్-సీకి గురైన వారిలో 30 ఏళ్ల తర్వాత లివర్ సిర్రోసిస్‌కు కనిపించే ప్రమాదముందని వైద్యులు చెబుతున్నారు. ఈ మధ్యలో ఉన్న కాలాన్ని క్రానిక్ హెపటైటిస్‌గా చెబుతారు. క్రానిక్ హెపటైటిస్ కాలంలో ఎటువంటి లక్షణాలు ఉండకపోవడం వల్ల లివర్ సిర్రోసిస్ స్టేజ్‌కు వెళ్లిపోతారని వైద్యులు పేర్కొంటున్నారు. లివర్ సిర్రోసిస్ స్టేజ్ అంటే లివర్ పూర్తిగా పాడైపోతుంది. సాధారణ స్థితికి తీసుకురాలేని స్థితి ఏర్పడుతుంది. లివర్ సిర్రోసిస్ స్టేజ్‌లో కడుపు పొంగడం, పచ్చకామెర్లు, రక్తపు వాంతులు, రక్తం బ్లీడ్ కావడం, ఆకలి, బరువు తగ్గడం వంటి లణాలు కనిపిస్తాయి. అల్ట్రా సౌండ్, రక్త పరీక్షలు, ఎండోస్కోపీ చేసి సమస్యను నిర్ధారిస్తారు.

కేజీహెచ్‌కు భారీగా రోగులు

కేజీహెచ్‌లో గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగానికి వచ్చే రోగుల్లో దాదాపు 30 శాతం మంది లివర్ సంబంధిత బాధితులు ఉంటున్నారు. లివర్ బాధితుల్లో 40 శాతం మంది హెపటైటిస్ వైరస్ కారణంగా ఉంటున్నారు. ప్రతినెలా హెపటైటిస్ వైరస్ బారినపడి లివర్ సమస్యలతో బాధపడుతూ ఇన్ పేషెంట్లుగా చేరుతున్న రోగుల సంఖ్య 30 వరకు ఉంటుంది. లివర్ బాధితుల కోసం కేజీహెచ్‌లో ప్రత్యేకంగా సోమవారం లివర్ క్లినిక్‌ను నిర్వహిస్తున్నారు. ఈ క్లినిక్‌లో లివర్ బాధితులకు ప్రత్యేకంగా వైద్య సేవలు అందిస్తున్నారు. లివర్ సమస్యలను గుర్తించడం, మందులు అందించడం, ఫైబ్రో స్కాన్ చేయడం వంటివి చేస్తున్నారు.

నేడు లివర్ వాక్

హెపటైటిస్ వైరస్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో బీచ్ రోడ్డులో లివర్ వాక్ నిర్వహిస్తున్నారు. ఉదయం ఆరు నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు వైరల్ హెపటైటిస్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఆరు నుంచి ఏడు గంటల మధ్య రన్ నిర్వహించనున్నారు.

తగిన జాగ్రత్తలతోనే హెపటైటిస్‌కు అడ్డుకట్ట



- డాక్టర్ ఎల్ఆర్ఎస్ గిరినాథ్,
గ్యాస్ట్రో ఎంట్రాలజీ
విభాగాధిపతి, కేజీహెచ్

హెపటైటిస్ వైరస్ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం ఎంతైనా అవసరం. గతంతో పోలిస్తే ప్రజల్లో అవగాహన పెరగడం వల్ల కేసుల సంఖ్య తగ్గు తోంది. పచ్చకామెర్లు, ఇతర లివర్ సమస్యలు వచ్చిన వాళ్లు మాత్రం అప్రమత్తంగా ఉండాలి. అదే సమయంలో వ్యాక్సినేషన్లు అందుబాటులో ఉన్నా యి. వ్యాక్సిన్ తీసుకోవడం వల్ల కూడా సమస్యకు చెక్ చెప్పవచ్చు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలో 2008 నుంచి హెపటైటిస్ వ్యాక్సిన్‌ను ఉచితంగా అందిస్తున్నారు. ఇప్పటివరకు 19 వేల మందికి వ్యాక్సిన్ ఇచ్చాం. ప్రతి బుధవారం ఈ వ్యాక్సిన్ ఇవ్వడం జరుగుతుంది. దీనిని మూడు డోసులు తీసుకోవాల్సి ఉంటుంది. గడిచిన ఏడాది వివిధ విభాగాలకు వచ్చిన ఐదు వేల మందికి హెపటైటిస్-బీ, సీ పరీక్షలు చేశాం. వీరిలో హెపటైటిస్-బీ రెండు శాతం మందికి ఉన్నట్టు నిర్ధారణ కాగా, హెపటైటిస్-సీ 0.1 శాతం మందిలో ఉన్నట్టు గుర్తించాం. గతంలో హెపటై టిస్-బీ నాలుగు శాతం మందిలో ఉండగా, హెపటైటిస్-సీ 1.5 శాతం మందిలో ఉండేది. ఈ గణాంకాలను పరిశీలిస్తే చాలా వరకు తగ్గుముఖం పట్టింది. అయితే వ్యాక్సిన్ తీసుకోవడం వల్ల మరింత నియంత్రించేందుకు అవకాశం ఉంది. ప్రజలు సరైన సమయంలో పరీక్షలు చేయించుకోవడం, పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం, ఆల్కహాల్ వంటి వాటికి దూరంగా ఉండడం మంచిది.

వండర్ కిడ్

▸ 57 సెకండ్లలో లింగాష్టకం ఆలపించిన ఐదేళ్ల బుడతడు
▸ ఏసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



ఆస్మాన్‌రామ్ | తల్లి మానసతో ఆస్మాన్‌రామ్

చోడవరం, జూలై 27: పట్టణానికి చెందిన ఐదేళ్ల బుడతడు ఏసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించాడు. పట్టణానికి చెందిన అలవల మానస, సత్యప్రసాద్‌ల కుమారుడైన ఎ.ఆస్మాన్‌రామ్(5) ఆన్‌లైన్‌లో 57 సెకండ్లలో లింగాష్టకం ఆలపించి రికార్డు సృష్టించడంతో ఏసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు నమోదైంది. గత నెలలో ఆస్మాన్ ఈ రికార్డు సృష్టించగా, ఏసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ నిర్వాహకులు ఆ కుటుంబానికి ఇటీవల సర్టిఫికెట్ అందజేశారు. ఆస్మాన్‌రామ్ రెండున్నరేళ్ల వయస్సులోనే 110 దేశాలకు చెందిన జాతీయ పతాకాలను గుర్తించి ఆయా దేశాల పేర్లు చెప్పడం ద్వారా ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించడం విశేషం. ఆస్మాన్‌రామ్ ప్రస్తుతం స్థానిక ప్రైవేటు పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నాడు.

పట్టాలు తప్పిన రైలు

▸ ఖాళీ కోచ్‌లతో యార్డు నుంచి ప్లాట్‌ఫారంపైకి వస్తుండగా ప్రమాదం
▸ రాకపోకలకు అంతరాయం
▸ ఆలస్యంగా బయలుదేరిన విశాఖ ఒరిజినేటింగ్ రైళ్లు

విశాఖపట్నం, జూలై 27: విశాఖ నుంచి మహబూబ్‌నగర్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు (12861) శనివారం రాత్రి ఏడు గంటల సమయంలో కోచింగ్ యార్డులో పట్టాలు తప్పింది. ట్రాక్ పాయింట్ ఫెయిలైన కారణంగానే రైలు పట్టాలు తప్పినట్టు తెలిసింది. ఖాళీ కోచ్‌లతో యార్డు నుంచి ప్లాట్‌ఫారం మీదకు వస్తుండగా స్టేషన్ సమీపంలో చివరి రెండు బోగీలు (జనరల్ కోచ్, ట్రైన్ మేనేజర్ (గార్డు) కోచ్‌లు) పట్టాలు తప్పాయి. సమాచారం తెలుసుకున్న అధికారులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. దెబ్బతిన్న రెండు కోచ్‌లను రేక్ నుంచి పక్కకు తప్పించి వాటి స్థానంలో మరో రెండింటిని జత చేసి ప్లాట్‌ఫారం మీదకు తీసుకువచ్చారు. ఈ ఘటనతో యార్డు, స్టేషన్‌కు మధ్య రెండు లైన్లలో గంటల తరబడి రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో విశాఖ నుంచి బయలుదేరే పలు ఒరిజినేటింగ్ రైళ్లను యార్డు నుంచి స్టేషన్‌కు చేర్చడంలో ఆలస్యం అయ్యింది. ఈ ప్రభావంతో విశాఖ-మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్‌తో (12861) పాటు, గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ (12837), నాందేడు ఎక్స్‌ప్రెస్ (12861) వంటి పలు రైళ్లు విశాఖ నుంచి గంటల తరబడి ఆలస్యంగా బయలుదేరాయి.

ప్రత్యేక రైళ్లు కొనసాగింపు

విశాఖపట్నం, జూలై 27: ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని హౌరా, యశ్వంత్‌పూర్ మధ్య నడుస్తున్న ప్రత్యేక రైళ్ల సర్వీసులను కొనసాగిస్తున్నట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. ఆగస్టు 15వ తేదీ వరకు హౌరా-యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్(02863), ఆగస్టు 17వ తేదీ వరకు యశ్వంత్‌పూర్ - హౌరా (02864) ఎక్స్‌ప్రెస్ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

వరి విత్తనాలు మొలకెత్తడం లేదు

... 5వ పేజీ తరువాయి

ఇది పెద్ద సమస్యగా పేర్కొన్నారు. అడవుల్లో పండ్ల చెట్ల పెంపకం చేపట్టడం ద్వారా కోతుల నుంచి రక్షిస్తామని హామీ ఇచ్చారు. వైద్యశాఖపై చర్చలో భాగంగా అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, అరకు, అనంతగిరి, పెదబయలు, కొయ్యూరు, చింతపల్లి జడ్పీటీసీ సభ్యులు మాట్లాడుతూ మలేరియా దోమల నుంచి రక్షణకు గాను దోమతెరలు వెంటనే పంపిణీ చేయాలని కోరగా, సంబంధిత అధికారులు బదులిస్తూ ఐదు లక్షల దోమతెరల కొనుగోలుకు టెండర్లు పిలిచామని, త్వరలో జిల్లాకు రానున్నాయన్నారు. అరకు ప్రాంతంలో అనేక మందికి సోరియాసిస్ వ్యాధి సోకడంతో ఇబ్బందులు పడుతున్నారని అరకు జడ్పీటీసీ సభ్యులు శెట్టి రోష్నీ ఆందోళన వ్యక్తంచేయగా, వైద్యబృందాలను పంపుతామని అధికారులు పేర్కొన్నారు. కొయ్యూరు మండలంలో ఆరు గ్రామాల్లో పదుల సంఖ్యలో రోగులు కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్నారని, వీరికి డయాలసిస్ సదుపాయం సక్రంగా అందడంలేని జడ్పీటీసీ సభ్యుడు నూకరాజు ఆందోళన వ్యక్తం చేశారు. జడ్పీ నిధుల నుంచి నర్సీపట్నం, పాడేరు ఆస్పత్రిలో ఫ్రీజర్లు ఏర్పాటుచేస్తామని చైర్‌పర్సన్ సుభద్ర వెల్లడించారు. విశాఖ కేజీహెచ్‌లో వైద్యసేవలు మరింతగా మెరుగుపరచాలని ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు కోరగా, అన్ని పార్టీల సభ్యులు మూకుమ్మడిగా ఆయనకు మద్దతు పలికారు. రోగుల కోసం వాకబు చేయడానికి ప్రయత్నిస్తే సూపరింటెండెంట్ కనీసం స్పందించడంలేదని పలువురు ఆరోపించారు. ఇటువంటి సమస్యకు తెరపడాలంటే కేజీహెచ్‌లో సూపరింటెండెంట్‌కు సాయంగా ఒక పీఆర్వోను నియమించాలని కోరగా కలెక్టర్ హరేంధిరప్రసాద్ సానుకూలంగా స్పందించారు. మరికొందరు సభ్యులు లేచి కేజీహెచ్ మార్చురీ వద్ద సొమ్ములు అడుగుతున్నారని ఆరోపించగా, చివరకు సర్టిఫికెట్ల జారీకి పైసలు ఇవ్వాల్సి వస్తోందని ధ్వజమెత్తడంతో పాటు కేజీహెచ్‌ను పూర్తిగా ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. సభ్యుల ఆందోళనపై కలెక్టర్ స్పందిస్తూ సేవలు మెరుగుపరచడంతో పాటు అవినీతిని అరికడతామని హామీ ఇచ్చారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నిర్మాణాలకు ఒక మాస్టర్‌ప్లాన్ రూపొందించాలన్నారు. గాజువాక పరిధి తుంగ్లాం ప్రాథమిక పాఠశాల కబ్జాకు గురైందని, దీనిపై ఎందుకు ఫిర్యాదుచేయలేదని నిలదీశారు. దీనిపై చైర్‌పర్సన్ సుభద్ర బదులిస్తూ తక్షణమే తుంగ్లాంలో ఆక్రమణలు తొలగిస్తామని హామీ ఇచ్చారు. ఈలోగా జడ్పీ సీఈవో పోలినాయుడు మాట్లాడుతూ ఆక్రమణల తొలగింపునకు న్యాయపరంగా చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు.

వేర్వేరుగా సమావేశాలు నిర్వహించండి

జడ్పీ సమావేశంలో పూర్తిస్థాయిలో అజెండా చర్చకు రావడంలేదని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అభిప్రాయపడ్డారు. కేవలం మూడు, నాలుగు అంశాలు మాత్రమే చర్చకు వస్తున్నాయని పేర్కొంటూ మొత్తం అంశాలపై చర్చించాలంటే అల్లూరి సీతారామరాజు జిల్లాకు ఒక సమావేశం, అనకాపల్లి, విశాఖ జిల్లాల పరిధిలో సభ్యులకు ఒక సమావేశం ఏర్పాటుచేయాలని సూచించగా, సీఈవో పోలినాయుడు వివరణ ఇస్తూ సమావేశాలు వేర్వేరుగా నిర్వహణకు కోరం సమస్య తలెత్తుతుందని పేర్కొంటూ, దీనిపై తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. సమావేశానికి తొలిసారిగా వచ్చిన ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, పంచకర్ల రమేశ్‌బాబు, విశ్వేశ్వరరాజు, మత్స్యలింగం, సుందరపు విజయకుమార్‌లను సత్కరించారు.

'గోవాడ షుగర్స్ రైతులకు బిల్లులు చెల్లించాలి'

మాడుగుల, జూలై 27: గోవాడ షుగర్ ఫ్యాక్టరీకి చెరకు సరఫరా చేసిన రైతులకు పేమెంట్లు వెంటనే చెల్లించాలని మాడుగుల మండలం కేజే పురం గ్రామానికి చెందిన చెరకు రైతులు కోరుతున్నారు. శనివారం ఉదయం రైతులు రాపేటి సత్యనారాయణ, దాడి మల్లునాయుడు, ఆడారి కోదండ, కర్రి వెంకటరమణలు మాట్లాడుతూ గత ఏడాది డిసెంబర్ 23 నుంచి చెరకును గోవాడ షుగర్ ఫ్యాక్టరీకి సరఫరా చేశామని, అప్పటి నుంచి ఒకసారి మాత్రమే పేమెంట్ వచ్చిందని, మిగతా పేమెంట్ పది నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు యాజమాన్యం ఇవ్వలేదన్నారు. ఇది వ్యవసాయ పనులకు సంబంధించి సీజన్ కాబట్టి వరినాట్లు వేసుకోవడానికి రైతులకు నగదు అవసరం ఉంటుందని, ఫ్యాక్టరీ యాజమాన్యం రైతుల ఆర్థిక ఇబ్బందులను గుర్తించి వెంటనే పేమెంట్ అందించాలని వారు కోరారు.

వర్షాలు ఖరీఫ్ సాగుకు అనుకూలం

అనకాపల్లి అగ్రికల్చర్, జూలై 27: ఈ నెలలో వర్షాలు విస్తారంగా కురిసినందున ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ఆశాజనకంగా ఉంటుందని ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ సీహెచ్ ముకుందరావు తెలిపారు. శనివారం అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్‌లో జరిగిన జిల్లా వ్యవసాయ సమీక్ష సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. జూన్, జూలై సాధారణ వర్షపాతం 272 మిల్లీ మీటర్లు కాగా, 400 మిల్లీ మీటర్లు నమోదైందన్నారు. లోతట్టు ప్రాంతాల్లో నీట మునిగిన వరి నారు, ఇతర పంటలలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై చర్చించారు.

స్టాండింగ్ కమిటీలో పది స్థానాలూ కైవసం చేసుకోవాలి

▸ కూటమి కార్పొరేటర్ల సమన్వయ సమావేశంలో ఎమ్మెల్యేలు
▸ నామినేషన్ల దాఖలు రేపు

విశాఖపట్నం, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : వచ్చే నెల ఏడున జరిగే స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో పది స్థానాలను కైవసం చేసుకోవడం ద్వారా జీవీఎంసీలో కూటమి జెండా ఎగురవేయాలని ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, పంచకర్ల రమేష్‌బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ అధ్యక్షతన టీడీపీ, జనసేన, బీజేపీ కార్పొరేటర్లతో సమన్వయ సమావేశం శనివారం దసపల్లా హోటల్‌లో జరిగింది. ఇటీవల టీడీపీ, జనసేనలో చేరిన కార్పొరేటర్లు సైతం ఈ సమావేశానికి హాజరయ్యారు. స్టాండింగ్ కమిటీలో పది స్థానాలు ఉన్నందున ఏ పార్టీకి ఎన్ని స్థానాలు ఇవ్వాలి, వారిని ఎవరు ఎంపిక చేయాలనేదానిపై నేతలు, కార్పొరేటర్ల మధ్య చర్చ జరిగింది. స్టాండింగ్ కమిటీకి పోటీ చేసే సభ్యులను ఎంపిక చేసే బాధ్యతను ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలకు అప్పగించాలని నిర్ణయించారు. ప్రస్తుతం కూటమికి 47 మంది సభ్యులు మద్దతు ఉన్నందున మరో ఐదుగురిని పార్టీలో చేర్చుకుంటే మంచిదని టీడీపీ ఫ్లోర్‌లీడర్ పీలా శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ గంధం శ్రీనివాసరావు అభిప్రాయపడ్డారు. కూటమి నుంచి పోటీ చేసేవారంతా సోమవారం నామినేషన్లు దాఖలు చేయాలని తీర్మానం చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

రైలు పట్టాలపై తాగునీటి పైపులైను లీకేజీ

కశింకోట, జూలై 27 : ఇక్కడి రైల్వే పట్టాల దిగువన ఉన్న తాగునీటి పైపలైన్లు దెబ్బతినడంతో శనివారం పట్టాలపై నీరు ప్రవహించింది. ఈ విషయాన్ని తెలుసుకున్న రైల్వే అధికారులు సదరు ప్రాంతాన్ని పరిశీలించారు. అనకాపల్లి మండలం సంపతిపురం రిజర్వాయర్ దగ్గర నుంచి కశింకోట గ్రామానికి తాగునీరు అందించే ప్రధాన పైప లైను దెబ్బతినడంతో లీక్ అయ్యిందని వారు తెలిపారు. తక్షణమే పైపులైను మరమ్మతులు చేపట్టాలని మినీ రిజర్వాయర్ అధికారులకు సూచించారు.


లీకేజీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

డిసెంబరు 8, 9 తేదీల్లో జిల్లా మహాసభలు

సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

అనకాపల్లి టౌన్, జూలై 27 : నర్సీపట్నంలో డిసెంబరు 8, 9 తేదీల్లో సీపీఎం జిల్లా మహాసభలను నిర్వహించనున్నట్టు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కె. లోకనాథం పేర్కొన్నారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జి. కోటేశ్వరరావు అధ్యక్షతన దొడ్డి రామునాయుడు భవనంలో శనివారం జరిగిన జిల్లా ప్లీనమ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఉపాధి హామీ పథకం కూలీలకు రూ. 40 కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయన్నారు. ఈ బకాయిలను వెంటనే చెల్లించి ఉపాధి కూలీలను ఆదుకోవాలని కోరారు. అన్ని ప్రాంతాల్లో ఉపాధి పనుల్లో కూలీలకు అవకాశం కల్పించాలన్నారు. జిల్లాలో 825 ఎకరాల్లో ఆకుమడులు దెబ్బతిన్నాయని 2,662 మంది రైతులు నష్టపోయారన్నారు. తక్షణమే వీరిని ఆదుకోవాలని సమావేశం డిమాండ్ చేసింది. సమావేశంలో పార్టీ నాయకులు ఎం.అప్పలరాజు, డి. వెంకన్న, అన్నిమండలాల నుంచి పార్టీ నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కార్యదర్శి లోకనాథం

మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలామ్‌కు నివాళులు

అనకాపల్లి టౌన్, జూలై 27 : దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలామ్ వర్ధంతి సందర్భంగా శనివారం పలువురు నివాళులర్పించారు. స్థానిక ఉడ్‌పేట వద్ద గల ఆయన విగ్రహానికి అబ్దుల్‌కలామ్ సేవా సంస్థ వ్యవస్థాపకుడు ఎ.ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో టీడీపీ విశాఖజిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్ పూలమాల వేసి నివాళులర్పించారు. డీవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ కోరిబిల్లి రమేష్, జమీర్, కోటిపల్లి జేజిబాబు, ఎస్.బాబి, దాడి బుజ్జి తదితరులు పాల్గొన్నారు. అలాగే బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, పార్టీ నాయకులు కలామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డైట్ ఇంజినీరింగ్ కళాశాలలో చైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు, వైస్ ప్రిన్సిపాల్ కె.శ్యామ్ దుర్గాప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి బి.సుధీర్‌కుమార్ తదితరులు అంజలి ఘటించారు


కలామ్‌కు నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

'రెడ్‌బుక్ అంటే జగన్‌కు ఉలికిపాటు ఎందుకు?'

అనకాపల్లి టౌన్, జూలై 27 : రెడ్ బుక్ అంటే జగన్‌కు ఉలికిపాటు ఎందుకని తెలుగుశక్తి రాష్ట్ర అధ్యక్షుడు బీవీ రామ్ ప్రశ్నించారు. శనివారం స్థానిక డీవీఆర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 36 మంది హత్యలకు గురయ్యారని, జగన్ ఢిల్లీ వేదికగా రాష్ట్రప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి వాస్తవాలను ప్రకటించాలని డిమాండ్ చేశారు.

బదిలీపై వెళుతున్న అధికారులకు సత్కారం

కోటవురట్ల, జూలై 27 : బదిలీపై వెళుతున్న తహసీల్దార్ వెంకటరమణను కార్యాలయ సిబ్బంది శనివారం ఇక్కడ ఘనంగా సత్కరించారు. సార్వత్రిక ఎన్నికల ముందు శ్రీకాకుళం జిల్లా నుంచి ఇక్కడికి విచ్చేసి విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కాశీవిశ్వనాథం మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడంతో తహసీల్దార్ చక్కని పాత్ర పోషించారన్నారు. సన్మాన గ్రహీత వెంకటరమణ మాట్లాడుతూ తనకు మంచి సహకారం అందించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. డీటీ, ఆర్ఐలతో పాటు హౌసింగ్ ఏఈ జగదీశ్వరరావు, వీఆర్‌వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


తహసీల్దార్ వెంకటరమణకు సిబ్బంది సత్కారం


ఏఎస్ఐ శంకరరావును సత్కరిస్తున్న సీఐ తదితరులు

సబ్బవరం : ఇక్కడి పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తూ విజయనగరం జిల్లాకు బదిలీపై వెళుతున్న ఎల్‌వీ శంకరరావును సిబ్బంది శనివారం ఘనంగా సత్కరించారు. సీఐ పిన్నింటి రమణ, ఎస్ఐ ధనుంజయ్, వెంకటేశ్వరరావు, ఏఎస్ఐలు సత్యనారాయణ, పడాల్, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనదారులు భద్రత నియమాలు పాటించాలి


అడ్డరోడ్డు జంక్షన్‌లో బైక్ ర్యాలీ ప్రారంభిస్తున్న సభ్యులు

ఎస్.రాయవరం, జూలై 27 : ద్విచక్ర వాహనాలు నడిపేవారు భద్రతా నియమాలను పాటించాలని సింహాచలం దేవస్థానం ఆదాయపు పన్ను, ఎంహెచ్ఏ విభాగం ప్రతినిధి బత్తిన మహేష్ సూచించారు. నైట్ హాక్ రైడింగ్ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని అడ్డరోడ్డు జంక్షన్ నుంచి వైజాగ్ వరకు శనివారం నిర్వహించిన బైక్ ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ర్యాలీ ఆర్గనైజర్ నిఖిల్ మాట్లాడుతూ నైట్ హాక్ రైడింగ్ క్లబ్ ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా ద్విచక్ర వాహనదారులకు మరింత అవగాహన పెంచేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో బీవీవీ సత్యనారాయణ, క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గజానికో గండం

▸ అత్యంత దారుణంగా అనకాపల్లి- చోడవరం రోడ్డు ▸ ఎక్కడికక్కడ గోతులు పడడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు


అనకాపల్లి నుంచి చోడవరం వెళ్లే ప్రధాన రోడ్డులో దర్జీనగర్ వద్ద ఏర్పడిన గుంతలు

అనకాపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి నుంచి చోడవరం వెళ్లే రోడ్డు అత్యంత దారుణంగా తయారైంది. అనకాపల్లి నుంచి చోడవరం, మాడుగుల నియోజకవర్గాలకు చేరుకోవాలన్నా ఈ రోడ్డే దిక్కు. ఫలితంగా ప్రతిరోజు వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఈ రోడ్డు నిర్వహణపై గత వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిరక్ష్యం చేయడంతో నేడు శిథిలావస్థకు చేరింది. దర్జీనగర్ సమీపంలో రోడ్డుపై పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు మామిడిపాలెం, దర్జీనగర్ రోడ్డుపై గుంతలు మరింత పెద్దవయ్యాయి. దీంతో వాహనదారులు ఈ రోడ్డు మీదుగా రాకపోకలు సాగించేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. ఆయా గోతుల్లో వర్షపు నీరు చేరుతుండడంతో రాత్రి వేళ ప్రయాణించేవారు ప్రమాదాలకు గురవుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడిన గోతులను పూడ్చాలని వాహనచోదకులు కోరుతున్నారు.

'పేట'లో వివాదాస్పద స్థలం పరిశీలించిన ఆర్డీవో

▸ రెవెన్యూ, పీహెచ్‌సీ సిబ్బంది నుంచి వివరాలు సేకరించిన జయరాం

పాయకరావుపేట, జూలై 27 : ఇక్కడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వివాదాస్పద స్థలాన్ని నర్సీపట్నం ఆర్డీవో జయరాం శనివారం పరిశీలించారు. ఆసుపత్రి ప్రహరీ గోడ నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో పక్క స్థల యజమాని ఆసుపత్రిలో తన స్థలం ఉందంటూ సర్వే చేయించుకుని, హద్దులు నిర్ణయించడం వివాదాస్పదంగా మారిన విషయం తెలిసిందే. గత రెండు రోజులుగా ఈ తంతు జరుగుతుండడంతో ఆర్డీవో ఇక్కడికి విచ్చేశారు. స్థలానికి సంబంధించిన వివరాలను స్థానిక రెవెన్యూ అధికారుల నుంచి తెలుసుకున్నారు. ఆసుపత్రి ప్రహరీగోడ గతంలో ఉన్నట్టుగా యథా స్థానంలోనే నిర్మించాలని ఆసుపత్రి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుభాష్, మండల సర్వేయర్ సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.


పీహెచ్‌సీలో వివాదాస్పద స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో

'నిరు పేదలకు ఉచిత న్యాయ సలహాలు'



ప్రసంగిస్తున్న ఎన్‌హెచ్‌ఆర్‌పీ సీఈవో రామచంద్రనాయుడు

సబ్బవరం, జూలై 27 : మండల కేంద్రం సబ్బవరంలో జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ ప్రాంతీయ కార్యాలయాన్ని సంస్థ సీఈవో టి.ఎస్.రామచంద్రనాయుడు స్థానిక సర్పంచ్ దెడ్డం ప్రసాద్ చేతుల మీదగా శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల హక్కులు కాపాడేందుకు, అన్యాయం, అక్రమాలపై పోరాటానికి సంస్థ కృషి చేస్తుందన్నారు. నిరుపేదలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు. ఉప సర్పంచ్ బలిరెడ్డి సూర్యప్రసాద్, వైస్ చైర్మన్ సూరిబాబు, డైరెక్టర్లు టి.సుబ్బారావు, డి.లక్ష్మీగాయత్రీ, జిల్లా కోర్టు న్యాయవాది సత్య చిరంజీవిరాజు తదితరులు పాల్గొన్నారు.

సవాళ్లను విద్యార్థులు చిరునవ్వుతో ఎదుర్కోవాలి

▸ జేఎన్‌టీయూ ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్ రాజ్యలక్ష్మి

అనకాపల్లి టౌన్, జూలై 27 : సవాళ్లను చిరునవ్వుతో ఎదుర్కోవాలని జేఎన్‌టీయూ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ డి.రాజ్యలక్ష్మి అన్నారు. డైట్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం జరిగిన గ్రాడ్యుయేషన్ డేలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. నైపుణ్యం పెంచుకోవాలనే దృక్పథం ఉన్నవారిదే భవిష్యత్తు అన్నారు. గౌరవ అతిథి ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ ఫెడరేషన్ చైర్మన్ సీహెచ్. శ్రీనాథ్ మాట్లాడుతూ ఉపాధి అవకాశాల కోసం వెతకడం కాకుండా తమ ఆలోచనలకు రూపమిచ్చి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ దేశాభివృద్ధిలో ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లదే కీలకపాత్రన్నారు. అనంతరం ఉత్తమ విద్యార్థులను సత్కరించారు. ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.


ఉత్తములకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న రాజ్యలక్ష్మి

ఏఎంఏఎల్ కళాశాలకు 'నాక్' గుర్తింపు

కొత్తూరు, జూలై 27 : స్థానిక ఏఎంఏఎల్ కళాశాలకు నాక్ గుర్తింపు లభించింది. బి డబుల్ ప్లస్ గ్రేడ్ సాధించినట్టు కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బొడ్డేడ అప్పారావు, పెనుమత్స కృష్ణంరాజు శనివారం తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఎయిడెడ్ విద్యా వ్యవస్థకు తీరని ఇబ్బందులు ఎదురయ్యాయని వాపోయారు. ఎయిడెడ్ విద్యా సంస్థలలో విద్యార్థుల నమోదు గణనీయంగా తగ్గాయన్నారు. వీటితో పాటు ప్రైవేటు విద్యా సంస్థల పోటీని కూడా తట్టుకొని ఏఎంఏఎల్ కళాశాల ధీటుగా నిలిచినట్టు చెప్పారు. ప్రధానంగా అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ రాకతో నాక్ సమావేశానికి హుందాతనం వచ్చిందన్నారు. కళాశాలకు ఇంతటి గుర్తింపు తీసుకువచ్చేందుకు కృషి చేసి వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

పెదఈశ్వరరావుకు కూటమి నేతలు పరామర్శ

ఎస్.రాయవరం, జూలై 27 : దార్లపూడి గ్రామానికి చెందిన వైసీపీ మండల సీనియర్ నాయకుడు పోలిశెట్టి పెదఈశ్వరరావును టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధంతో పాటు కూటమి నాయకులు శనివారం పరామర్శించారు. పెదఈశ్వరరావు సతీమణి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో నాయకులు ఆయన ఇంటికి వెళ్లి ఓదార్చారు. టీడీపీ నాయకులు గుర్రం రామకృష్ణ, వంగలపూడి గోవింద్, అమలకంటి గోవింద్, జనసేన మండల అధ్యక్షుడు పప్పల శివ పాల్గొన్నారు.

ఇంటర్ కళాశాలల్లో పాఠ్య పుస్తకాలు పంపిణీ



పాయకరావుపేట, కోటవురట్లలో పుస్తకాలను పంపిణీ చేస్తున్న నాయకులు

పాయకరావుపేట, జూలై 26 : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రభుత్వం సమకూర్చిన పాఠ్య పుస్తకాలను శనివారం టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను పంపిణీ చేశారు. ఎంఈవోలు కేఎన్‌గాంధీ, రమేష్, ప్రిన్సిపాల్ ఎం.రవిశంకర్‌తో పాటు టీడీపీ నాయకులు బి.అచ్చిరాజు, పల్లా విలియం కేరి, ఎం.రమాకుమారి, లెక్కల గోవిందు, జూరెడ్డి ప్రసాద్, వేములపూడి అప్పారావు, జనసేన పట్టణ అధ్యక్షుడు ఆచంట దొర, నారపురెడ్డి పద్మావతి పాల్గొన్నారు.

కోటవురట్ల : ఇక్కడి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రభుత్వం మంజూరు చేసిన పాఠ్య పుస్తకాలను టీడీపీ మండల అధ్యక్షుడు జానకి శ్రీనివాసరావు శనివారం పంపిణీ చేశారు. ఎంపీటీసీ పి.సూర్యారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఆర్‌టీ సుజాత, అధ్యాపకులు కొండలబాబు, జయరావు తదితరులు పాల్గొన్నారు.

పెదరాంభద్రపురంలో పారిశుధ్య పనులు

పాయకరావుపేట రూరల్, జూలై 27 : పెదరాంభద్రపురంలో శనివారం పారిశుధ్య పనులు చేపట్టారు. రోడ్డుపై ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించడంతో పాటు కాలువల్లో పేరుకుపోయిన పూడికను తీయించారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని ఎంపీడీవో కె.స్వప్న ఆదేశించడంతో సర్పంచ్ గంపల మార్తమ్మ, ఉప సర్పంచ్ రాజు, కార్యదర్శి రామగోవింద్ ప్రత్యేక దృష్టి సారించారు.

300 కిలోల గంజాయి స్వాధీనం

▸ కారులో తరలిస్తుండగా పట్టుకున్న పరవాడ పోలీసులు
▸ ఒకరి అరెస్టు.. మరొకరు పరారీ

లంకెలపాలెం, జూలై 27: ఒడిశా నుంచి కారులో తరలిస్తున్న 300 కిలోల గంజాయిని పరవాడ పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి నుంచి రూ.10 వేల నగదు, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. తాడి మూడు మదాల వద్ద శనివారం ఈ సంఘటన చేసుకొంది. ఇందుకు సంబంధించి పరవాడ సీఐ బాలసూర్యారావు తెలిపిన వివరాలివి. హైదరాబాద్ ఉప్పల్ ప్రాంతానికి చెందిన పి.సంతోశ్, సంతోశ్‌సింగ్‌లు ఒడిశా రాష్ట్రం ఘునుపూర్ జిల్లా పనసగూడ నుంచి కారుతో గంజాయి ప్యాకెట్లుతో బయలుదేరారు. కారు తాడి మూడు మదాల వద్దకు వచ్చేసరికి అజ్ఞాత వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు పరవాడ పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఇది చూసి కారు నిలుపు చేసి సంతోశ్‌సింగ్ అక్కడినుంచి పరారయ్యాడు. సంతోశ్‌ను అదుపులోకి తీసుకొని డిక్కీలో చూడగా, ప్యాకెట్లతో ఉన్న300 కిలోల గంజాయి బయటపడింది. కారుతో పాటు నిందితుడ్ని అదుపులోకి తీసుకుని, అతని వద్ద ఉన్న రెండు సెల్‌ఫోన్‌లు, రూ.10 వేల నగదను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న సంతోశ్‌సింగ్ కోసం గాలిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.


పట్టుబడ్డ గంజాయితో సీఐ బాల సూర్యారావు, పోలీస్ సిబ్బంది

'కౌలు రైతులకు పంట సాగు పత్రాలు'

అనకాపల్లి అగ్రికల్చర్, జూలై 27 : భూ యజమానులకు ఎటువంటి నష్టం లేకుండా కౌలు రైతులకు పంటసాగు పత్రాలు అందజేసేందు ప్రభుత్వం పంట సాగుదారుల హక్కు చట్టాన్ని అమలులోకి తెచ్చిందని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌలు రైతులంతా ఈ పథకం పొందేందుకు అర్హులని పేర్కొన్నారు. ఈ పత్రాల కాలపరిమితి 11 నెలలు ఉంటుందని వివరించారు. జిల్లాలో ఈ ఏడాది 5,560 పంట సాగుహక్కు పత్రాలు జారీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. గ్రామ సచివాలయాల్లోని గ్రామ పరిపాలనాధికారులకు దరఖాస్తు చేసుకున్న మూడు రోజుల్లో ఈ పత్రాలు వారికి అందుతాయని పేర్కొన్నారు. పత్రాలపై భూమి యజమాని, సాగుదారు, వీఆర్‌ఓల సంతకాలు అవసరమని స్పష్టం చేశారు. ఇంతవరకు 14 వందల పత్రాలను జారీ చేసినట్టు తెలిపారు.

ఎలమంచిలి ఎస్ఐగా సావిత్రి బాధ్యతలు

ఎలమంచిలి, జూలై 27 : పట్టణ ఎస్ఐగా కె.సావిత్రి శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనకాపల్లి స్పెషల్ బ్రాంచ్‌లో విధులు నిర్వహిస్తూ ఇక్కడికి బదిలీపై విచ్చేశారు. ఇదిలావుంటే, ఇప్పటి వరకు ఇక్కడ ఎస్ఐగా కొనసాగిన పాపినాయుడు అనకాపల్లి స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా కొత్త ఎస్ఐ మాట్లాడుతూ పట్టణ ప్రజల సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.



పాఠశాలలో చెట్టు నరికి వేతపై ఫిర్యాదు


పాఠశాలలో నరికివేతకు గురైన పచ్చని చెట్టు

కశింకోట, జూలై 27 : మండలంలోని కన్నూరుపాలెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఎంతో నీడనిచ్చే పచ్చని చెట్టును సర్పంచ్ ఇంటి గోడలకు కొమ్మలు తగులుతున్నాయని పూర్తిగా చెట్టునే తొలగించారు. దీనిపై పాఠశాల హెచ్ఎం జి.నాగమణిని అడుగగా సదరు సర్పంచ్ శివ ఇంటికి కొమ్మలు తగులుతున్నాయని చెప్పి తాము పాఠశాలకు రాకముందే చెట్టు మొత్తం తొలగించేశారని తెలిపారు. ఈ విషయంపై స్థానిక టీడీపీ నాయకులు వాసు తదితరులు పంచాయతీ కార్యదర్శికి, ఎంఈవో, పోలీసులకు ఫిర్యాదు చేశామని చెప్పారు.

సేంద్రియ ఎరువుల తయారీపై అవగాహన

పరవాడ, జూలై 27 : రావాడ గ్రామంలో శనివారం పొలం బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. సేంద్రియ ఎరువుల తయారీతో పాటు వాటిని వినియోగించుకోవడం వల్ల జరిగే ఉపయోగాలను వ్యవసాయాధికారిణి సీహెచ్.చంద్రావతి రైతులకు వివరించారు. సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు, రాంకీ ఫౌండేషన్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ శ్రీనివాస రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అనురాధ, స్థానిక నాయకులు కోన రామారావు, వియ్యపు చిన్న తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ సర్వీసింగ్‌పై ఉచిత శిక్షణ ప్రారంభం


కొత్తూరు, జూలై 27 : భారతీయ స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో సెల్‌ఫోన్ సర్వీసింగ్‌పై శనివారం ఇక్కడ ఉచిత శిక్షణ ప్రారంభమైంది. సంస్థ డైరెక్టర్ బి.విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఈ శిబిరంలో సెల్‌ఫోన్ రిపేరు, సర్వీసింగ్‌లలో శిక్షణ ఇస్తామన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. మొబైల్ ఫ్యాకల్టీ మణికంఠ, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయం కోసం నునపర్తి రజకులు ఆందోళన

అచ్యుతాపురం, జూలై 27 : వంశపారంపర్యంగా తాము కులవృత్తిని కొనసాగిస్తున్న ప్రాంతాన్ని సర్పంచ్ చుక్క అనూరాధ స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని, ఈ విషయంలో న్యాయం చేయాలని కోరుతూ నునపర్తికి చెందిన పలువురు రజకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం ఆందోళన చేపట్టారు నలమారెమ్మ రజక సంఘం అధ్యక్షుడు, కార్యదర్శి దుప్పాడ ముసిలి నాయుడు, తోకాడ రాజులతో పాటు వీరు ఇక్కడికి విచ్చేసి తమకు అన్యాయం జరుగుతోందని వాపోయారు. నునపర్తి పంచాయతీ సర్వే నంబరు 1/5సి లోగల సుమారు రెండెకరాల భూమిలో నలభై కుటుంబాలకు చెందిన తాము బట్టలు ఉతుకుతూ జీవనం సాగిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఈ భూమి తమకు చెందినదని నునపర్తి సర్పంచ్ అనూరాధ అధికారంతో స్వాధీనం చేసుకోటానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. వందేళ్లకు పైగా తమ వంశీకుల నుంచి ఇప్పటి వరకు ఈ భూమిలోనే బట్టలు ఉతుకుతూ జీవనం సాగిస్తున్నామన్నారు. ఇప్పుడు అధికారులను అడ్డుపెట్టుకుని తమకు అన్యాయం చేయాని చూస్తున్నారని వాపోయారు.అనంతరం డీటీ నీరజకు వినతి పత్రాన్ని అందజేశారు.

శ్రీవాణి కళాశాల వ్యవస్థాపకులు మృతి

ఎస్.రాయవరం, జూలై 27: మండలంలోని అడ్డరోడ్డులో గల శ్రీవాణి జూనియర్ కళాశాల వ్యవస్థాపకులు పూడి మురళీధర్ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఇందుకు సంతాపం తెలియజేస్తూ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు శనివారం మౌనం పాటించారు. కళాశాల చైర్మన్ అన్నం వెంకట్రావు, ప్రిన్సిపాల్ సుభాకర్, అధ్యాపక బృందం ఏవో కొప్పిశెట్టి హేమలత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.


పూడి మురళీధర్ (ఫైల్ ఫొటో

పాఠశాలల్లో పచ్చని సోయగాలకు కంకణం



అచ్యుతాపురం : హరిపాలెం పాఠశాలలో మొక్క నాటుతున్న దృశ్యం


నక్కపల్లి మండలం పెదబోదిగల్లం హైస్కూల్‌లో...


కశింకోట మండలం వెదురుపర్తి జడ్పీ హైస్కూల్‌లో...

అచ్యుతాపురం, జూలై 27 : పచ్చదనం పెంపుతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని హరిపాలెం ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీపాద రవి అన్నారు. శనివారం శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని పాఠశాలలో నిర్వహించారు. ఇందులో భాగంగా స్పందించే హృదయం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాండ్రేగుల వెంకరమణ, ఎం.వెంకటఅప్పారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

కశింకోట: వెదురుపర్తి జడ్పీ హైస్కూల్‌లో మొక్కలు నాటారు. శిక్షా సప్తాహ్‌లో భాగంగా నలభై మంది విద్యార్థులు తమ తల్లులతో మొక్కలు నాటించారు. స్పందించే హృదయం సంస్థ అధ్యక్షుడు శిష్ట తమ్మిరాజు, హెచ్ఎం జీవీకే ఆచారి, డీవీఎన్ స్కూల్ హెచ్ఎం అప్పారావు, బాలికోన్నత హైస్కూల్ హెచ్ఎం స్వర్ణకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోటవురట్ల : పందూరు ఎంపీపీ స్కూల్, కోటవురట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో శనివారం వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. ఎంఈవో రామారావు జోషి ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ఆయా మైదానాల్లో మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులు ఆకులతో బొమ్మలు తయారు చేయడంతో వాటిని ఎంఈవో తిలకించి అభినందించారు. ఇన్‌చార్జి హెచ్ఎం నారాయణరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో పందూరు సర్పంచ్ చికెట్ల జగదీష్, మాజీ సర్పంచ్ నారాయణరావు, మాజీ ఎంపీటీసీ భాస్కరరావు పాల్గొన్నారు.


కోటవురట్ల మండలం పందూరు పాఠశాలలో..

నక్కపల్లి : శిక్షా సప్తాహ్‌లో భాగంగా పెదబోదిగల్లం పాఠశాల ఆవరణలో హెచ్ఎం సత్యనారాయణ శనివారం మొక్కలు నాటారు. ఉపాధ్యాయులు ఎన్‌వీఎస్ ఆచార్యులు, ఎస్.ఫల్గుణరావు, ఎన్‌వీఎల్ఎన్ కుమారి, చిన్నారావు, కె.రమేష్‌బాబు, ఎ.శ్రీదేవిలతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా అమ్మ పేరుతో శనివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద ఉప్పలంలో హెచ్ఎం కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పేరెంట్ కమిటీ చైర్మన్ పి.గణేష్, టీడీపీ నాయకులు దత్తుడు, వీర్ల శంకరరావు, దుర్గారావులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని మొక్కలు నాటారు. ధర్మవరం అగ్రహారం జడ్పీ హెచ్ పాఠశాలలో విద్యార్థుల తల్లిలతో సుమారు నలభై మొక్కలు నాటించారు. హెచ్ఎం బి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు ఎమ్మెల్యే బండారు పరామర్శ


ఎంపీడీవో పట్నాయక్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బండారు

కె.కోటపాడు, జూలై 27 : హృద్రోగంతో విశాఖపట్నంలోని రాంనగర్ కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న స్థానిక ఎంపీడీవో బలివాడ సత్యకూర్మనాథ్ పట్నాయక్‌ను శనివారం మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి పరామర్శించారు. ఎన్నికల ముందు విజయనగరం జిల్లా నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చిన పట్నాయక్ కొద్ది రోజు క్రితం అనారోగ్యానికి గురయ్యారు.

ఆధార్ కేంద్రానికి విద్యుత్ అంతరాయం

» స్పందించని ఈపీడీసీఎల్ సిబ్బంది తీరుపై ఎంపీడీవో అసంతృప్తి


ఆధార్ కేంద్రం సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేశ్వరి

చీడికాడ, జూలై 27 : అర్హులైన వారందరికీ ఆధార్‌కార్డులు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎంపీడీవో ఉమామహేశ్వరి అన్నారు. కోనాం సచివాలయంలో ఆధార్ సేవా కేంద్రాన్ని శనివారం ఉదయం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కోనాం పంచాయతీ నుంచి సుమారు 50మందికి పైగా గిరిజనులు తరలివచ్చారు. ఆధార్ సేవా కేంద్రం వద్ద 25 మందికి ఆధార్‌కార్డులు నమోదు చేయగా అనంతరం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందన్నారు. సుమారు రెండు గంటల వరకూ విద్యుత్ రాలేదని ఆమె తెలిపారు. దీనిపై విద్యుత్‌శాఖ అధికారులకు ఫోన్ చేసినా కనీసం స్పందించలేదని, దీనిపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు. అలాగే ప్రతి రోజు విద్యుత్ కోతలు అధికంగా ఉంటున్నాయంటూ ఇక్కడి గిరిజనులు ఫిర్యాదు చేశారని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్టు ఎంపీడీవో చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సన్యాసిరావు, సచివాలయ సిబ్బంది, సర్పంచ్ చలుగు ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలామ్‌కు నివాళి


కలామ్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న సత్యనారాయణ

కె.కోటపాడు, జూలై 27 : మాజీ రాష్ట్రపతి, 'భారత రత్న' డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ వర్ధంతి సందర్భంగా కె.కోటపాడులోని అయ్యన్న విద్యాసంస్థల ప్రాంగణంలో శనివారం అబ్దుల్ కలామ్ విగ్రహానికి జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డీసీసీబీ) మాజీ డైరెక్టర్, బీజేపీ సీనియర్ నాయకులు చల్లా సత్యనారాయణమూర్తి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ డాక్టర్ అబ్దుల్ కలాం స్ఫూర్తి ప్రదాత అని కొనియాడారు. ఆయన ప్రతి మాట ఒక సందేశమే అన్నారు. ఈ కార్యక్రమంలో అయ్యన్న విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఖాశీం, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


దేవరాపల్లిలో కలామ్‌కు నివాళులు..

దేవరాపల్లి : అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా స్థానిక ఉన్నత పాఠశాలలో కలాం విగ్రహానికి ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ ఆధ్వర్యంలో ఘనంగా శనివారం నివాళులు అర్పించారు. ఈ తరానికి అబ్దుల్‌కలాం స్ఫూర్తి దాయకమన్నారు. కార్యక్రమంలో వేదిక ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవగాహనతో సీజనల్ వ్యాధులు దూరం


ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య శాఖ సిబ్బంది

గొలుగొండ, జూలై 27 : మండలంలోని పలు గ్రామాల్లో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం డెంగ్యూ జ్వరాలపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. మండలంలోని చిన్నయ్యపాలెం, గొలుగొండ, జోగంపేట గ్రామాల్లో ఈ ర్యాలీలు చేపటారు. ఈ సందర్భంగా శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ ఇంట్లోతో పాటు పరిసరాల్లో, వీధుల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త పడాలన్నారు. నీటి నిల్వల వల్ల దోమల వ్యాప్తి చెందుతాయన్నారు. ఈ సీజన్‌లో చిన్నపాటి జ్వరాలు, ఎలాంటి అనారోగ్య సమస్యలు వచ్చినా వెంటనే పీహెచ్‌లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సింగంపల్లి రాజ్యలక్ష్మీ, ఆశ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎం.బెన్నవరంలో చోరీ

నాతవరం, జూలై 27 : మండలంలోని ఎం.బెన్నవరంలో శుక్రవారం సాయంకాలం వంతల రాంబాబు ఇంట్లో రెండు తులాల బంగారం, పది తులాల వెండి, పది వేల రూపాయలు చోరీ జరిగింది. ఎస్‌ఐ ఎం.రామారావు అందించిన వివరాలిలా ఉన్నాయి. రాంబాబు వేరే ఊరు సొంత పని మీద వెళ్లి శుక్రవారం సాయంకాలం ఇంటికి వచ్చి చేసేసరికి ఇంటి తలుపులు బీరువా తలుపులు పగులగొట్టి బీరువాలో ఉన్న బంగారం వెండి, నగదును గుర్తుతెలియని వ్యక్తులు తీసుకెళ్ళిపోయారు. రాంబాబు ఫిర్యాదు మేరకు శనివారం ఘటన స్థలాన్ని పరిశీలించినట్లు ఎస్‌ఐ రామారావు తెలిపారు. కేసు దర్యాప్తు చేసున్నట్లు ఎస్‌ఐ రామారావు తెలిపారు.

టీడీపీ నేతల ఆధ్వర్యంలో గోతుల పూడ్చివేత


రోడ్డుపై గోతులను పూడ్చుతున్న దృశ్యం

నాతవరం, జూలై 27 : నాతవరం మండలం తుని-నర్సీపట్నం రూట్‌లో ఎ.శరభవరం వద్ద రోడ్డు మధ్యలో ఉన్న గోతులను ఎంటీ పట్నం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు క్వారీ క్రషర్ తో పూడ్చారు. ఈ కార్యక్రమంలో కిల్లాడ నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

వీరవిల్లి అగ్రహారంలో జనసేన క్రియాశీల సభ్యత్వ నమోదు


విలేకరులతో మాట్లాడుతున్న జనసేన నాయకులు

మాడుగుల రూరల్, జూలై 27 : మండలంలోని వీరవిల్లి అగ్రహారంలో జనసేన పార్టీ క్రియాశీల సభ్యత్వాలు జోరుగా సాగుతున్నాయి. ఈ నెల 18 నుంచి 28వ తేదీ వరకు సభ్యత్వ నమోదు కొనసాగిస్తున్నామని స్థానిక జనసైనికులు పాశిల గుణాజీ, కలిపిరెడ్డి రాజా(కేఆర్), సుంకరి వెంకట అప్పారావు, అశోక్, కృష్ణ తదితరులు తెలిపారు. సభ్యత్వం నమోదు చేసుకోవడానికి గ్రామంలో ప్రత్యేకంగా కౌంటర్ ఏర్పాటు చేసి మరింత అవగాహన కల్పిస్తున్నామన్నారు.

సమన్వయంతో సమస్యల పరిష్కారం

» మండల సమావేశంలో అధికారులకు ఎంపీపీ సత్యనారాయణ సూచన


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సత్యనారాయణ

మాకవరపాలెం, జూలై 27 : గ్రామాల్లో సమస్యలపై అధికారులు సమన్వయంతో పని చేసి పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీపీ సత్యనారా యణ పేర్కొన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు సమస్యలపై నిలదీశారు. మండలంలో ఉన్న కస్తూర్బా పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు, ఉపాధ్యాయ నియమాకాలకు సంబంధించిన సమాచారం వెల్లడించాలని బూరుగుపాలెం ఎంపీటీసీ రుత్తల యర్రాపాత్రుడు డిమాండ్ చేశారు. మాకవరపాలెం సర్పంచ్ అల్లం పల్లి శిరీష మాట్లాడుతూ మాకవరపాలెంలోని 68సర్వే నంబరులో ఇచ్చిన ఎల్‌పీసీలు రద్దు చేయాలని, బీసీ కాలనీలో ఆక్రమణలు తొలిగించాలని కోరారు. రైతులకు కావాల్సిన అన్ని రకాల ఎరువులు రైతు భరోసా కేంద్రాల్లో సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి చిరంజీవి తెలిపారు. కౌలు రైతులకు కార్డులు మంజూరు చేస్తున్నామని చెప్పారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. తాగునీటి పథకాల ద్వారా సరఫరా చేసే నీటిలో క్లోరినేషన్ చేస్తున్నామన్నారు. వెలుగు ఏపీఎం చిన బాబు మాట్లాడుతూ డ్వాక్రా సభ్యులకు చిన్న వ్యాపారాలకు రుణాలు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో చంద్రరావు, ఈవోపీఆర్‌డీ సీతామహాలక్ష్మి, వైస్ ఎంపీపీలు తుల్లిరాజారావు, రుత్తల లక్ష్మి, డీటీ శంకరరావు, అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.


నర్సీపట్నంలో మొక్కలు నాటుతున్న విద్యారులు


గొలుగొండ : ఎమ్మార్పీ కార్యాలయం వద్ద..


నాతవరం : గునుపూడి హైస్కూలులో..


కె.కోటపాడు హైస్కూలు వద్ద..

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

శిక్షా సప్తాహ్‌లో మొక్కలు నాటిన టీచర్లు, విద్యార్థులు, అధికారులు

శిక్షా సప్తాహ్‌లో భాగంగా శనివారం పలు మండలాల్లోని పాఠశాలల్లో శనివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. పలువురు అధికారులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని మొక్కలు నాటారు.

నర్సీపట్నం, జూలై 27 : శిక్షా సప్తాహ్ ఎకో క్లబ్ డే కార్యక్రమంలో ఎంఈవోలు తలుపులు, నాగేంద్ర పర్యవేక్షణలో పలు పాఠశాలలో విద్యార్థులు మాతృమూర్తి పేరుతో మొక్కలు నాటి నీరు పోశారు. వేములపూడి మోడల్ స్కూల్, నర్సీపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారులు ఆధ్వర్యంలో ఎకో క్లబ్ డే నిర్వహించారు. ఎరకన్నపాలెం ఎంపీపీ పాఠశాలలో హెచ్‌ఎం అళ్ళ వరప్రసాద్, దుగ్గాడ ఎంపీపీ స్కూల్‌లో హెచ్‌ఎం జీవీ రమేశ్, అప్పన్నపాలెం ఎంపీపీ స్కూల్‌లో ఆవరణలో ఉపాధ్యాయుడు కుంభంపాటి శుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో విద్యార్థులు మొక్కలు నాటారు.

గొలుగొండ : మండల కేంద్రంలో గల విద్యాశాఖ కార్యాలయంలో ఉపాధ్యాయులు శనివారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఒ.సత్యనారాయణ పాల్గొన్నారు. పీఆర్టీయూ మండల గౌరవాధ్యక్షుడు కురస వెంకటరమణ ఆధ్వర్యంలో సుమారు ఆరువేల రూపాయలు విలువ చేసే పలురకాల మొక్కలు విద్యాశాఖ కార్యాలయానికి వితరణ చేశారు.ఈ కార్యక్రమంలో మండల పీఆర్టీయూ అధ్యక్షుడు శ్రీరామ్మూర్తి, ప్రధాన కార్యదర్శి రమణమూర్తి, ఉపాధ్యాయులు లోవ రమేష్, జి.సంబరాజు తదితరులు పాల్గొన్నారు.

నాతవరం : మండలంలోని గునుపూడి హైస్కూల్‌లో విద్యార్థులు, తల్లిదండ్రులతో కలసి శిక్షా సప్తాహ్‌లో భాగంగా 90 మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 కామిరెడ్డి వరహాలబాబు హెచ్‌ఎం శివజ్యోతి, సీఆర్పీ పి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


బుచ్చయ్యపేట : ఆకట్టుకున్న కందిపూడి పాఠశాల విద్యార్థుల ప్రదర్శన

బుచ్చెయ్యపేట : శిక్షా సప్తాహ్‌లో భాగంగా కందిపూడి పాఠశాల ఆవరణలో శనివారం మొక్కలు నాటారు. స్థానికులకు మొక్కలను పంపిణీ చేశారు. విద్యార్థులు వనదేవత, జంతువుల వేషధారణతో మొక్కల పెంపకం వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రదర్శన రూపంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం బీఎస్ మూర్తి, ఉపాధ్యాయులు లావణ్య, ప్రశాంత్, రమణ, శ్రీరామ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : ప్రతి విద్యార్థి తల్లి పేరు మీద మొక్క నాటి దాన్ని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని కె.కోటపాడు ఎస్‌ఐ డి.లక్ష్మీనారాయణ విద్యార్థులకు సూచించారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఎస్.పద్మావతి ఆధ్వర్యంలో శిక్షా సప్తాహ్‌లో నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఎంఈవో-1 కె.సత్యనారాయణ ఎంఈవో-2 డీవీడీ ప్రసాద్, ఉపాధ్యాయులు బి.ఎరుకునాయుడు, కె.విజయలక్ష్మి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రోలుగుంట : పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలని రోలుగుంట జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం డీఎస్ఎస్వీ ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని రోలుగుంట జడ్పీ హైస్కూల్‌లో శిక్ష సప్తాహ్‌లో భాగంగా పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులతో మొక్కలు నాటారు. వెలంకాయలపాలెంలో ఉపాధ్యాయులు బండారు సూర్యనారాయణ, చంద్రశేఖర్‌ల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : శిక్షా సప్తాహ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని కాశీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లితండ్రులతో మొక్కలు నాటించారు. బేతపూడి కెజీబీవీలో విద్యార్థినులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంఈవో-2 ఉషారాణి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బీటీ సుందరి, ప్రత్యేక అధికారి సీహెచ్ భువనమాధురి, రమణ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



రోలుగుంట : మొక్కలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు, టీచర్లు



దేవరాపల్లి : కాశీపురంలో హైస్కూలులో..

ఆక్రమణ తొలగింపులో స్వల్ప ఉద్రిక్తత

» అధికారులను అడ్డుకున్న దుకాణ యజమాని కుటుంబ సభ్యులు

» పోలీసుల సహాయంతో రేకుల షెడ్డు తొలగింపు


స్టేడియం స్థలంలో ఏర్పాటు చేసిన రేకుల షెడ్డును తొలగిస్తున్న దృశ్యం

నర్సీపట్నం, జూలై 27: ఎన్టీఆర్ మిని స్టేడియం స్థలంలో ఆక్రమణ తొలగింపు స్వల్ప ఉద్రిక్తతకు దారి తీసింది. పూజా సామగ్రి విక్ర యించే వ్యాపారి స్టేడియం స్థలం ఆక్రమించి దుకా ణం ఏర్పాటు చేసుకున్నాడు. దీనిపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో టౌన్ ప్లానింగ్ అధికారి వెంకటేశ్వరరావు ఆక్రమణ తొలగించాలని ఆ వ్యాపారిని శుక్రవారం హెచ్చరించి వెళ్లారు. శనివారం ఉదయం ఎక్స్‌కవేటర్‌తో సహా మునిసిపల్ సిబ్బంది, ఆర్‌వో స్టేడియం వద్దకు వచ్చారు. పట్టణ పోలీసులు బందో బస్తు ఏర్పాటు చేశారు. ఎక్స్‌కవేటర్‌తో ఆక్రమణ తొలగించడానికి ప్రయత్నించినప్పుడు దుకాణ యజమాని కుటుంబ సభ్యులు అడ్డు పడ్డారు. టీపీవో వెంకటేశ్వరావు వచ్చి ఆక్రమణ తొలగించడానికి చర్యలు తీసుకున్నారు. స్టేడియం ఆక్రమణ జరుగుతుంటే ఏం చేస్తున్నావని సచివాలయం ప్లానింగ్ సెక్రటరీపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు, మెమో ఇచ్చి సస్పెండ్ చేయిస్తానని హెచ్చరించారు. తరువాత టీపీవోకి దుకాణ యజమానికి మధ్య వాగ్వాదం జరిగింది. తర్వాత పోలీసుల సహాయంతో మునిసిపల్ సిబ్బంది ఎక్స్‌వేటర్ తో దుకాణాన్ని తొలగించారు. ఉదయం నుంచి పోలీసులు, మునిసిపల్ సిబ్బంది మోహరించడంతో అక్కడ ఏం జరగబోతుందోనని ప్రజలు భారీగా గుమిగూడారు. వారిని అక్కడ నుంచి పంపించి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఇన్‌చార్జి సీఐ హరి, ఎస్‌ఐలు సుధాకరరావు, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.


సంఘటన స్థలం వద్ద ఇన్‌చార్జి సీఐ హరి, ఎస్‌ఐలు సుధాకరరావు, ఉమామహేశ్వరరావు, మునిసిపల్ అధికారులు

గలగల పారుతున్న 'గాదిగుమ్మి'



కృష్ణాదేవిపేట సమీపంలో వలసంపేట వద్ద గల గాదిగుమ్మి జలపాతం వర్షం నీటితో కళకళలాడుతుంది. కొద్ది రోజుల క్రితం వరకూ నీరు లేక ఈ జలపాతం కళ తప్పింది. వారం రోజులుగా కురిసిన వర్షాలతో వర్షం నీరు పోటెత్తి ఇప్పుడు పరవళ్ళు తొక్కుతోంది. జిల్లాలోని పర్యాటక ప్రాంతాల్లో ఒకటిగా పేరు గాంచిన ఈ గాదిగుమ్మి జలపాతం 40 అడుగుల ఎత్తయిన రాయిపై నుంచి జలజలపారుతూ పర్యాటకులను ఆనందింపజేస్తుంది. ఈ గాదిగుమ్మి జలపాతం అందాలను చూసేందుకు రాష్ట్ర నలమూలలు నుంచి పర్యాటకులు వేల సంఖ్యలో వస్తుంటారు. కార్తీకమాసంలో సందడి ఎక్కువ ఉంటుంది.

- కృష్ణాదేవిపేట

వర్షాలకు నువ్వు పంట నాశనం


» రైతులు విలవిల


ఏపీ పురంలో వర్షాలకు కుళ్లిపోయి పాడైన నువ్వుపంటను చూపుతున్న రైతు గోవింద్

నాతవరం, జూలై 27 : గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు నాతవరం మండలంలో వందలాది ఎకరాల నువ్వుపంట నీట మునిగి కుళ్లిపో యింది. ఎకర నువ్వుపంట సాగుకు రూ.10 వేల వరకు పెట్టుబడి పెట్టామని, ఇప్పుడు కుళ్లిపోవడంతో నష్టపోతున్నామని వాపోయారు. ఎకరానికి రూ.20 వేలు నుంచి రూ.25 వేల వరకు ఆదాయం వస్తుందనుకున్న సమయంలో వర్షాలకు బాగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డిసెంబరు 8, 9న నర్సీపట్నంలో జిల్లా మహాసభలు

» సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం


మాట్లాడుతున్న లోకనాథం

అనకాపల్లి టౌన్, జూలై 27 : నర్సీపట్నంలో డిసెంబరు 8, 9 తేదీల్లో సీపీఎం జిల్లా మహాసభలను నిర్వహించనున్నట్టు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కె. లోకనాథం పేర్కొన్నారు. జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు జి. కోటేశ్వరరావు అధ్యక్షతన దొడ్డి రామునాయుడు భవనంలో శనివారం జరిగిన జిల్లా ప్లీనమ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఉపాధి హామీ పథకం కూలీలకు రూ. 40 కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయన్నారు. ఈ బకాయిలను వెంటనే చెల్లించి ఉపాధి కూలీలను ఆదుకోవాలని కోరారు. అన్ని ప్రాంతాల్లో ఉపాధి పనుల్లో కూలీలకు అవకాశం కల్పించాలన్నారు. జిల్లాలో 825 ఎకరాల్లో ఆకుమడులు దెబ్బ తిన్నాయని 2,662 మంది రైతులు నష్టపోయారన్నారు. తక్షణమే వీరిని ఆదుకోవాలని సమావేశం డిమాండ్ చేసింది. సమావేశంలో పార్టీ నాయకులు ఎం.అప్పలరాజు, డి. వెంకన్న, అన్నిమండలాల నుంచి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఆర్డీవో కార్యాలయంలో క్లీన్ అండ్ గ్రీన్


కార్యాలయ ఆవరణలో మొక్కలను తొలగిస్తున్న సిబ్బంది

నర్సీపట్నం, జూలై 27 : సబ్ కలెక్టర్ కార్యాలయంలో శుభ్రత, పచ్చదనానికి ఆర్డీవో జయరాం శ్రీకారం చుట్టారు. ఇటీవల జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ నర్సీపట్నం వచ్చినప్పుడు సబ్ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో పిచ్చి మొక్కలు, అపరిశుభ్రంగా ఉండటం గమనించి ఆర్డీవోను ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో ఆర్డీవో కార్యాలయం ఆవరణలో స్వచ్ఛభారత్ చేపట్టారు. పచ్చదనం కోసం మొక్కలు నాటించి, గ్రీవెన్స్‌కి వచ్చే వారి కోసం దాతల సహకారంతో బెంచీలు, తాగునీరు ఏర్పాటు చేస్తామని ఆర్డీవో తెలిపారు.

పాలిటెక్నిక్ కళాశాలలో 24 సీట్లు ఖాళీ

చోడవరం, జూలై 27 : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 24 సీట్లు ఖాళీగా ఉన్నాయని ప్రిన్సిపాల్ తెలిపారు. కళాశాలలో డీఈసీఈలో 11 సీట్లు, డీసీఎంఈ కోర్సులలో 13 సీట్లు ఖాళీగా ఉన్నాయని వెల్లడించారు. ఈ కోర్సులలో చేరాలనుకునే ఆసక్తి గల విద్యార్థులు నేరుగా సంప్రదించాలని సూచించారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల నగదు విడుదల

మాడుగుల, జూలై 27 : ఆగస్టు 1న లబ్ధిదారులకు సామాజిక పింఛన్లు చెల్లింపునకు మండలంలో 11 వేల 803 మందికి రూ.5 కోట్ల 12 లక్షల 73 వేల 500లు ప్రభుత్వం విడుదల చేసిందని ఎంపీడీవో ఆర్.కాళీప్రసాద్ తెలిపారు. మండలంలో 23 సచివాలయాల పరిధిలో 174 మంది సచివాలయ ఉద్యోగులను పింఛన్ల పంపిణీకి నియమించినట్టు చెప్పారు. గత నెలలో 117 మంది పింఛనుదారులు మృతి చెందారని చెప్పారు. 1, 2 తేదీల్లో పింఛన్ల పంపిణీ పూర్తి చేస్తామని, తరువాత చెల్లింపులు ఉండవని తెలిపారు.

హడలెత్తించిన రక్తపొడ

» హతమార్చిన రైతు కూలీలు


రైతు కూలీలు హతమార్చిన రక్తపొడ పాము

రావికమతం, జూలై : పొలం పనులు చేస్తున్న కూలీలను రక్తపొడ కనిపించడంతో హడలిపోయారు. వెంటనే ఆ పామును హతమార్చారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మత్స్యపురం గ్రామ పొలాల్లో రైతులు, కూలీలు పొలం పనులు చేస్తుండగా తుప్పల్లో నుంచి రక్తపొడ పాము దూసుకొచ్చింది. అక్కడ ఉన్న వారంతా భయాందోళనలకు గురవుతున్నారు. ఆ పాము చాలాసేపు అక్కడే ఉంటూ బుసలు కొట్టింది. కొంతసేపటి తర్వాత మగ కూలీలు ఆ పామును హతమార్చారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ

చీడికాడ, జూలై 27 : మండలంలోని జైతవరంలో శుక్రవారం రాత్రి ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి 30 ఏళ్ల పూర్తయిన సందర్భంగా మహజన సోషలిస్ట్ పార్టీ, మాదిగ సంఘం జిల్లా ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో పలువురు కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ


ఫిజియోథెరపీ చేస్తున్న దృశ్యం

బుచ్చెయ్యపేట, జూలై 27 : భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపిస్ట్ లావణ్య సేవలు అందించారు. కాలు, చెయ్యి, వెన్నెముక సమస్యలున్నా విద్యార్థులకు సేవలు అందించారు. ఎంఈవో కాశీవిశ్వేశ్వరరావు ఫిజియోథెరపిస్టు సేవలను పరిశీలించారు. దివ్యాంగ వికలాంగులకు వైద్య సేవల కోసం మండలానికి ఒక ఫిజియోథెరపిస్ట్‌ను ప్రభుత్వం నియమించిందన్నారు. దివ్యాంగ విద్యార్థులు ఈ సేవలను వినియోగించుకోవాలని ఎంఈవో కోరారు.

రహదారి కోసం నిధులు ఇవ్వండి

రోలుగుంట, జూలై 27 : మండలంలోని కాముడుపాలెం-చెట్టుపల్లి,తమరానపాలెం-రొంగలిపాలెం గ్రామాలకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఎంపీ సీఎం రమేష్‌ను కలిసి బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తమరాన వెంకటరమణ వినతిపత్రం అందించారు. గత ప్రభుత్వం హయాంలో అనేకసార్లు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ఎంపీ ఫండ్స్ నుంచి ఆయా గ్రామాలకు నిధులు మంజూరు చేసి సహకరించాలని కోరారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి


విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

చీడికాడ, జూలై 27 : వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతకు అందరూ ప్రాధాన్యమివ్వాలని మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ వెంకటరావు కోరారు. కోనాం శివారు గుడివాడ ప్రభుత్వ పాఠశాలలో శనివారం విద్యార్థులకు తనిఖీలు చేశారు. అనంతరం గుడివాడ, జాజులపాలెం గ్రామాల్లో స్ప్రేయింగ్ నిర్వహించిన రక్త పరీక్షలు నిర్వహించి జ్వరాల తనిఖీ చేశారు. అనందరం వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి ప్రాణాంతక వ్యాధులు సోకకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరావు, హెల్త్ అసిస్టెంట్ పెంటకోట పేరు నాయుడు, ఏఎన్ఎం రాజేశ్వరి, ఆశవర్కర్లు సేవలు అందించారు.